
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ



సురేష్ కమ్యూనికేషన్స్ CSC
పాన్ కార్డు, పాస్‌పోర్టు
ఎ.ఎస్.యం రిజిస్ట్రేషన్, & రెన్యూవల్
డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుకింగ్స్
రైల్వే టికెట్లు బస్ టిక్కెట్లు రిజర్వేషన్
మనీ ట్రాన్స్‌ఫర్, మనీ విత్‌డ్రా
బైక్, కారు, ఆటో, ఇన్సూరెన్స్
ఆర్.టి.ఎ సర్వీసెస్
ఆన్‌లైన్ జాబ్ & ఎగ్జామ్ అప్లికేషన్స్
ఐ.యన్.యం, ఐ.ఎస్సీ
లైఫ్ సర్టిఫికెట్లు
డోర్ నెం. 14-5-16, లేపాక్షి ఎదురుగా, గాంధీనగర్, విజయవాడ - 03



| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 138 | ది.1-9-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 138 | Date : 1-9-2026 | Tuesday | Pages : 8 | Rs.1/- |


# భగీరథ ప్రయత్నంతో కరవు సీమకు కృష్ణమ్మ

- 30 ఏళ్ల కల సాకారం..వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ప్రారంభించిన సీఎం
- నల్లమల కొండల్ని చీల్చుకుని నల్లమల సాగర్‌కు కృష్ణమ్మ పరుగు
- తొలిదశతో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు..4 లక్షల మందికి తాగునీరు
- జలహారతి అనంతరం కృష్ణా జలాలకు సీఎం సాష్టాంగ నమస్కారం
- 2028లో రెండోదశ పూర్తి... మార్కాపురంలోనూ కృష్ణా పుష్కరాలు
- మార్కాపురం దోర్నాల వద్ద బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగం





**మార్కాపురం, ఆగష్టు 31 (వార్తాప్రభ) :** మూడు దశాబ్దాలుగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారమైంది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద నల్లమల కొండల్లోని జంట సొరంగాల నుంచి వెలువడిన కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, జల హారతి ఇచ్చి స్వాగతించారు. అనంతరం ప్రాజెక్టు తొలిదశ ప్రారంభోత్సవానికి సూచికగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కరవునేలను తాకిన కృష్ణా జలాలకు ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. శ్రీశైలం జలాశయంలోని కొల్లం వాగు నుంచి గ్రావిటీ ద్వారా తరలించిన కృష్ణా జలాలు వెలిగొండ జంట సొరంగాల మీదుగా గంటవానిపల్లె అక్విడెక్టు కు చేరుకుని నల్లమల సాగర్ వైపు పరుగులు తీశాయి. నల్లమల కొం డలను చీల్చుకుని కాలువ ల్లో ప్రవహించిన కృష్ణ మ్మకు స్థానిక మహిళలు, ప్రజలు పుష్పాలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం పవిత్ర జలాలను సీఎం చంద్రబాబు మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులపై స్వయంగా చల్లారు. అక్విడెక్టు వద్ద రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి స్విచ్ నొక్కి జలాలను దిగువకు వదిలారు.

**30 ఏళ్ల క్రితం భూమిపూజ.. నేడు ప్రారంభం..** వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం తన జీవితంలో భావోద్వేగ సందర్భమని చంద్రబాబు పేర్కొన్నారు. 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా తానే ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశానని, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత 2026 ఆగస్టు 31న ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తున్నానని చెప్పారు. సీఎం మాట్లాడుతూ.. "ఆ రోజు చేసిన సంకల్పం.. ఈ రోజు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది. ఇది భగీరథ ప్రయత్నం. కొండలు అడ్డు వచ్చినా తొలిచి ముందుకు వెళ్లాం. కరువు నేలకు కృష్ణమ్మను తీసుకొచ్చాం. శ్రీశైలం మల్లన్న సన్నిధి నుంచి బయలుదేరిన కృష్ణమ్మ.. మార్కాపురం చెన్న కేశవుడు కొలువైన నేలకు జలహారతి ఇస్తోంది. ప్రజలు ఇచ్చిన తీర్పుతోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించుకుని జల సిరులతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడిగాం. వెలిగొండ బంగారు కొండ అవుతుంది. ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుంది. మాట ఇచ్చాం.. ప్రాజెక్టు పూర్తి చేసి కృష్ణమ్మను తరలించాం. ఇక సంపద సృష్టిస్తాం. మార్కాపురం గడ్డకు, కరువుతో పోరాడిన రైతన్నలకు, ఫ్లోరైడ్ బాధలు భరించిన కుటుంబాలకు, నీటి కోసం ఎదురు చూసి అలసిపోయిన తరాలకు కృష్ణా జలాలతో కొత్త ఊపిరి ఇస్తున్నాం."అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**నిర్వాసితుల త్యాగాలకు పాదాభివందనం..** వెలిగొండ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, గ్రామాలను త్యాగం చేసిన 11 గ్రామాల ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానని సీఎం అన్నారు. రైతుల త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. "ప్రాజెక్టు వల్ల లబ్ధి పొందేవారు ఎంత సంతోషంగా ఉంటారో.. నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలి. కేవలం 48 రోజుల్లో 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారం అందించాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిర్వాసితుల బాధలు, అవసరాలను గుర్తించి అదనంగా మరో రూ.169 కోట్లు చెల్లిస్తున్నాం. కటాఫ్ తేదీని పెంచి 18 ఏళ్లు నిండిన యువతకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున అందించాం. రూ.10,200 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టులో ఇప్పటివరకు రూ.7,983 కోట్లు ఖర్చు చేసి మొదటి దశను పూర్తి చేశాం. 18.8 కిలోమీటర్ల మేర జంట సొరంగాలు, 21.8 కిలోమీటర్ల ఫీడర్ కాలువల పనులు పూర్తి అయ్యాయి.

# హైదరాబాద్.. దేశానికి గ్లోబల్ నాలెడ్జ్ హబ్

- ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో తెలంగాణ కీలక ఒప్పందాలు
- రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 'తెలంగాణ రైజింగ్'కు మరో ముందడుగు



**హైదరాబాద్,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** హైదరాబాద్‌ను దేశంలోనే అతి పెద్ద గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేసింది. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం బ్రిటన్, అమెరికాలో పర్యటించింది. ఆగస్టు 19 నుంచి 29 వరకు జరిగిన ఈ పర్యటనలో పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలతో కీలక చర్చలు జరిగాయి. పలు ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలు, లెటర్ ఆఫ్ ఇంటెంట్‌లు సైతం కుదిరాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వైస్ చైర్‌పర్సన్ శాంతకుమారి, ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్-ఆఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్ తదితర ఉన్నతస్థాయి అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

**హైదరాబాద్‌కు ప్రపంచస్థాయి వర్సిటీలు..** సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, తయారీ రంగాల్లో ఇప్పటికే హైదరాబాద్ కీలక కేంద్రంగా ఉంది. రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లోనూ నగరం వేగంగా ఎదుగుతోంది. ఈ బలాన్ని మరింత పెంచేలా ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమెరికాలోని ప్రముఖ నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ, ఇంగ్లండ్‌లోని 17 స్వతంత్ర విద్యాసంస్థల సమాఖ్య అయిన యూనివర్సిటీ ఆఫ్ లండన్... భారత్‌లో తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నాయి. నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ భారత్ ఫ్యూచర్ సిటీలో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించడం గమనార్హం. యూనివర్సిటీ ఆఫ్ లండన్ కూడా త్వరలో హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేయనుంది.

**ఎల్ఎస్ఈ, ఎస్ఓఏఎస్‌లతో చర్చలు..** ప్రపంచ ప్రఖ్యాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఎల్ఎస్ఈ), స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ (ఎస్ఓఏఎస్) ప్రతినిధులతో తెలంగాణ బృందం విస్తృతంగా చర్చలు జరిపింది. హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయడం, పరిశ్రమలతో విద్యాసంస్థల అనుసంధానం పెంచడం, బోధనా పద్ధతులను మెరుగుపరచడం, కొత్త తరహా తరగతి గది విధానాలను తీసుకురావడం వంటి అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సంస్థలు తమ బృందాలను హైదరాబాద్‌కు పంపించి ఇక్కడ విద్యా కేంద్రాల ఏర్పాటు అవకాశాలను పరిశీలించేందుకు అంగీకరించాయి. తమ అధ్యాపకులు హైదరాబాద్‌లో ఉండి విద్యా కార్యక్రమాలు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలించనున్నాయి.

**హైదరాబాద్‌లో హార్వర్డ్ కోర్సులు..** ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ కూడా హైదరాబాద్‌లో స్వల్పకాలిక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులు నిర్వహించేందుకు అంగీకరించింది. ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, కార్పొరేట్ సంస్థల సీనియర్ అధికారుల కోసం ఈ కోర్సులను డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించనున్నారు. తెలంగాణ రైజింగ్ బృందం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (MIT), లండన్ బిజినెస్ స్కూల్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, ఇంపీరియల్ కాలేజ్ లండన్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు, సీనియర్ అధ్యాపకులతో చర్చలు జరిపింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో రాష్ట్రంలో సంయుక్త పరిశోధనా కేంద్రాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే అంశంపై చర్చలు జరిగాయి.

**ప్రత్యేక టాస్క్‌ఫోర్స్..** బ్రిటన్, అమెరికా పర్యటన ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమావేశమై పర్యటనలో జరిగిన చర్చలు, సాధించిన పురోగతిని సమీక్షించారు. ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్ ఏర్పాటును వేగంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, కాలేజీలు, పాఠశాలలను హైదరాబాద్‌కు తీసుకురావాలని సూచించారు. అవసరమైన చోట ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయడంతో పాటు.. ప్రపంచస్థాయి విద్యాసంస్థల సర్టిఫికెట్ కోర్సులు, ప్రత్యేక కోర్సులు హైదరాబాద్‌లోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

**'రూ.3 ట్రిలియన్ లక్ష్యానికి పెద్ద బలం'..** "2047 నాటికి తెలంగాణను త్రి-ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న మా లక్ష్యానికి ఈ పర్యటన పెద్ద బలం ఇచ్చింది. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న మధ్యంతర లక్ష్యానికీ ఇది ఉపయోగపడుతుంది.

# పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి

- రేపటి తరాలకు పచ్చని భవిష్యత్తును అందించేందుకు సహకరించాలి
- పారిశ్రామిక వర్గాలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు



**విజయవాడ,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** రాష్ట్ర ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమైనదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలని కోరారు. పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం ద్వారా వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని పవన్ కళ్యాణ్ తెలిపారు. భా వితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం మనం దరి బాధ్యత అని పేర్కొ న్నారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ముందుకు రావాలని సూచించారు. అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణలను సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమాజానికి, ప్రకృతికి, రాబోయే తరాలకు విలువైన భవిష్యత్తును అందించగలమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ-గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.


**IN THE COURT OF II ADDL., CIVIL JUDGE (JUNIOR DIVISION) AT VIJAYAWADA**
ORIGINAL SUIT NO 15 of 2022
BETWEEN:-
CANARA BANK, SIDDARTHA NAGAR BRANCH
------PLAINTIFF
AND
1) Nagulla Renuka
2) N.Siva Naga Malleswara Rao
------DEFENDANT
TO
**1st Defendant:-** Nagalla Renuka W/o. Siva Nagamalleswara Rao, residing at Door No.10-7-28, 2nd Floor, Madhava Plaza, Mogalrajapuram, Vijayawada-520 010
**2nd Defendant:-** Nagalla Siva Nagamalleswara Rao S/o. Venkateswara Rao, residing at Door No.10-7-28, 2nd Floor, Madhava Plaza, Mogalrajapuram, Vijayawada-520 010
Please take Summons that the above Suit is filed against you and the same is posted on 02-09-2026 for your appearance.
Therefore you are hereby directed to appear on 02-09-2026 at 10.30 A.M, either in Person or through your Advocate before the Honourable Court and in default the matter will be decided exparte.
**(BY ORDER OF THE HONOURABLE COURT)**
**MD.HAYAD** B.Com., B.L.,
**MD ABDUL RAHEEM**
ADVOCATES
#41-9-18, L.R.K. Towers, SF-2, 2nd Floor,Ramalayam Street,Naidupeta,Krishnalanka , Vijayawada-13.
Cell No : 9440174135



**వేలం ప్రకటన**
మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 502 /2025
Between :
నంగేగడ్డ సుజాత ----వాది
మరియు
భట్రాజు వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు వగైరా ----ప్రతివాది
To.,
**1వ ప్రతివాది :** భట్రాజు వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు
S/o. గోపాల కృష్ణ మూర్తి,
R/o. D.No. 27/165,
పాతరామన్నపేట , మచిలీపట్నం.
పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీకు నోటీసు అమలు నిమిత్తం ది. 15.09.2026నకు వాయిదా అయియున్నది. కావున సదరువాయిదా రోజున ఉదయం గం. 10.30ని. లకు పైకోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీపరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి యుత్తర్వుల ప్రకారం)
**సోడిశెట్టి బాలాజీరావు**
వాది తరపున న్యాయవాది
మచిలీపట్నం.


# ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ ను కైవసం చేసుకున్న విశాఖపట్నం జట్టు

- రన్నరప్ గా నిలిచిన తిరుపతి జట్టు
- మూడో స్థానాన్ని దక్కించుకున్న విజయనగరం టీం
- ఫైనల్‌లో తిరుపతి జట్టుపై 2--1 తేడాతో ఘన విజయం సాధించిన విశాఖపట్నం జట్టు
- మూడో స్థానం పోరులో ఈస్ట్ గోదావరిపై విజయనగరం 4--2 తేడాతో విజయం
- ముగిసిన ఏపిఎఫ్ఏ సీనియర్ మెన్--2026 ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్
- ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్‌కు మరింత బలమైన భవిష్యత్తును నిర్మిస్తాం--కొటగిరి శ్రీధర్







**మైలవరం,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఏ పి.ఎఫ్.ఏ.) ఆధ్వర్యంలో మైలవరం పట్టణంలోని డా.లకిరెడ్డి హనిమి రెడ్డి / లక్ష్మీ రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ అండ్ లకిరెడ్డి బాలి రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ గ్రౌండ్స్ లో సోమవారం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సీనియర్ మెన్--2026 ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ పోటీ ఉత్కంఠ భరితంగా సాగింది. తిరుపతి, విశాఖపట్నం జట్ల మధ్య హోరాహోరీగా సాగిన పోటీలో తిరుపతి జట్టుపై 2--1 గోల్స్ తేడాతో విశాఖపట్నం జట్టు ఘన విజయం సాధించింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పాల్గొన్న జట్లు టోర్నమెంట్ ఆద్యంతం అత్యుత్తమ క్రీడా ప్రతిభ ను ప్రదర్శించాయి.చివరి రోజు ఆగస్టు 31వ తేదీ జరిగిన గ్రాండ్ ఫైనల్, మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్ లు హోరాహోరీగా సాగటంతో ఫుట్‌బాల్ అభిమానులను విశేషంగా ఆకట్టుకు న్నాయి.ఫైనల్ మ్యాచ్ ఛాంపియన్ ట్రోఫీ లక్ష్యంగా ఇరు జట్లు ఆరంభం నుంచే దూకుడైన ఆటతీరును ప్రదర్శించాయి.ప్రతి గోల్ కోసం ఇరు జట్ల ఆటగాళ్లు తీవ్రంగా పోరాడగా,కీలక సమయాల్లో వచ్చిన అవకాశాలను సమర్థవంతం గా సద్వినియోగం చేసుకున్న విశాఖపట్నం జట్టు మ్యాచ్‌పై ఆధిపత్యం సాధించింది.చివరకు విశాఖపట్నం 2--1 గోల్స్ తేడాతో తిరుపతిపై అద్భుత విజయం సాధించి ఏ.పి.ఎఫ్.ఏ. సీనియర్ మెన్--2026 ఏ.పి.ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌గా అవతరించింది. టోర్నమెంట్ లో ఆద్యంతం అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి ఫైనల్ వరకు చేరుకున్న తిరుపతి జట్టు రన్నరప్ గా నిలిచింది.

**మూడో స్థానం కోసం రాసవత్తంగా సాగిన పోరు:** మూడో స్థానం కోసం రాసవత్తంగాసాగిన పోరులో ఈస్ట్ గోదావరిపై 2--4 గోల్స్ తేడాతో విజయనగరం జట్టు విజయం సాధించింది.ఇరు జట్లు దూకుడైన ఆటతీరుతో గోల్స్ కోసం హోరాహోరీగా తలపడ్డాయి.కీలక సమయాల్లో మెరుగైన సమన్వయం ప్రదర్శించిన విజయనగరం జట్టు వచ్చిన అవకాశాలను గోల్స్‌గా మలుచుకొని మ్యాచ్‌పై పట్టు సాధించింది.

**"ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్‌కు మరింత బలమైన భవిష్యత్తును నిర్మిస్తాం ----కొటగిరి శ్రీధర్..** ఛాంపియన్‌షిప్ విజయవంతంగా ముగిసిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మరియు విశాఖపట్నం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కొటగిరి శ్రీధర్ విన్నర్ గా నిలిచిన విశాఖపట్నం, రన్నరప్ తిరుపతి, మూడో స్థానంలో నిలిచిన విజయనగరం, నాలుగో స్థానంలో నిలిచిన ఈస్ట్ గోదావరి జట్లను ప్రత్యేకంగా అభినందించారు. ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న అన్ని జిల్లాల క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, రిఫరీలు, అధికారులు మరియు సపోర్టింగ్ స్టాఫ్‌కు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా కొటగిరి శ్రీధర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్‌కు మరింత బలమైన భవిష్యత్తును నిర్మిస్తామని తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లో ఫుట్‌బాల్‌కు అపారమైన ప్రతిభ ఉందన్నారు. జిల్లాల్లో ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారికి సరైన వేదికలు కల్పించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దడమే ఇ్రాఖీూ ప్రధాన లక్ష్యం అనీ,ఇలాంటి ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్‌లు క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు.గెలుపు ఒక్కటే క్రీడ యొక్క లక్ష్యం కాదని క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి, జట్టు భావనతో ముందు కు సాగడం కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి జిల్లా జట్టు, ప్రతి క్రీడాకారుడు అభినందనీయులే అని అన్నారు.భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ నుంచి మరింత మంది ప్రతిభావంతులైన ఫుట్‌బాల్ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు.రాష్ట్రంలో ఫుట్‌బాల్ అభివృద్ధికి మరిన్ని టోర్నమెంట్లు, ప్రతిభ గుర్తింపు కార్యక్రమాలు నిర్వహిస్తూ యువ క్రీడాకారులకు అవకాశాలు కల్పించేందు కు ఏ.పి.ఎఫ్.ఏ.కృషి చేస్తుందని ఆయన తెలిపారు.

**స్పాన్సర్లకు కొటగిరి శ్రీధర్ ప్రత్యేక కృతజ్ఞతలు:** ఛాంపియన్‌షిప్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు విశేష సహకారం అందించిన రాధికా చారిటబుల్ ట్రస్ట్ మరియు స్పాన్సర్ ఎం. శ్రీహరి కి ఏ.పి.ఎఫ్.ఏ. అధ్యక్షులు కొటగిరి శ్రీధర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముందుకు వచ్చి ఇలాంటి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌కు సహకారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా ఫుట్‌బాల్ అభివృద్ధికి ఇలాంటి సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు.

**ఎల్.బి.ఆర్.సి.ఈ.యాజమాన్యం, నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు:** టోర్నమెంట్ నిర్వహణకు మైదానాలు మరియు ఇతర సౌకర్యాలను అందించి సహకరించిన లకిరెడ్డి బాలి రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ యాజమాన్యం, కమిటీ సభ్యులు మరియు సిబ్బందికి కొటగిరి శ్రీధర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఛాంపియన్‌షిప్ నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా చేపట్టిన ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ మరియు కృష్ణా జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులను ప్రత్యేకం గా అభినందించారు. ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ గౌరవ చైర్మన్ జిల్లా సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, నిర్వాహక కమిటీ సభ్యులు, రిఫరీలు, గ్రౌండ్ సిబ్బంది, వాలంటీర్లు మరియు టోర్నమెంట్ విజయవంతానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులకు వసతి, భోజనం, మైదానాల నిర్వహణ మరియు ఇతర అవసరమైన ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించడంలో అందరూ సమిష్టిగా చేసిన కృషి అభినందనీయ మని కొటగిరి శ్రీధర్ పేర్కొన్నారు.

# శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో సెప్టెంబర్ 4 కృష్ణాష్టమి వేడుకలు..

### -ధర్మకర్తల మండలి చైర్మన్ అంగడాల సత్యప్రసాద్ (సతీష్)



**గుడివాడ, ఆగష్టు 31 (వార్తాప్రభ) :** స్థానిక కాకర్ల వీధి లో కొలువైన శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో సెప్టెంబర్ 4 ఉదయం 6 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు గంటల వరకు శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ అంగడాల సత్యప్రసాద్ (సతీష్) తెలిపారు. ఉత్సవాలను శాసనసభ్యులు వెనిగండ్ల రాము ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామివారికి విశేష పూజలు మంగళ హారతి తీర్థప్రసాదాల వినియోగం జరుగుతుందన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు శ్రీహరి విట్టల కోలాట భజన మండలి వారిచే కోలాటం మరియు సాయంత్రం ఐదు గంటలకు ఉట్టి కొట్టుట కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అనంతరం శ్రీ స్వామివారి నీరాజనం ఉంటుందని పేర్కొన్నారు కావున భక్తులు యావన్మంది ఈ కార్యక్రమానికి విచ్చేసి తీర్థ ప్రసాదములు స్వీకరించాలని దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కందుల వేణుగోపాల్ రావు మరియు దేవస్థాన ట్రస్టీలు కాజా శ్రీనివాస్,దిల్లాన్ చంద్రశేఖర్, కొల్లిపర ఆంజనేయులు, మద్రిదు సీతారామయ్య, పతకమూరీ శాంతి, మునగ దుర్గా పద్మజ, మానేపల్లి నాగమణి, మరియు నల్లపాటి శ్రీనివాస దాశరథి అర్చక లు ఒక ప్రకటనలో తెలిపారు.

# పి జి ఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న మండల అధికారులు



**విస్సన్నపేట,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** స్థానిక మండల రెవెన్యూ మరియు ప్రజాపరిషత్ కార్యాలయాలలో మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి ఎంపీడీవో చిన్న రాట్నాలు సారధ్యంలో పి జి ఆర్ ఎస్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. తెల్లదేవరపల్లి ఎరుపు గుర్తు భూముల గురించి రైతులు దరఖాస్తు చేశారు . ఎరుపు గుర్తు తొలగించి తమకు పాస్ పుస్తకాలు ఇప్పించవలసిందిగా వారి విజ్ఞప్తి చేశారు. మండల రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొనగా ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, గృహ నిర్మాణ శాఖ ఏఈ సత్యనారాయణ ,ఏ ఈ సత్యనారాయణ, ఏవో ప్రసాద్, ఈవో హరికృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అధికారులకు దరఖాస్తుదారులకు ఫస్ట్ ఎయిడ్ అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

# బాలికలకు అవసరమైన మెటీరియల్ అందించిన జడ్పీటిసి గద్దె రమణ



**తిరువూరు,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** విద్యార్థుల చదువుకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని తిరువూరు మాజీ జెడ్పీటీసీ సభ్యులు, గద్దె రమణ అన్నారు. తిరువూరులోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు అవసరమైన డ్రెస్ మెటీరియల్‌తో పాటు పాఠశాల అవసరాల కోసం మైక్ సెట్‌ను సుమారు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గద్దె రమణ మాట్లాడుతూ.. "విద్యార్థులు మన సమాజానికి భవిష్యత్ తరాలు. ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా పిల్లలు మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలి. అందుకు పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు ఉండటం ఎంతో ముఖ్యం. విద్యార్థులకు ఏ చిన్న సహాయం చేసినా అది వారి భవిష్యత్తుకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతోనే ఈ డ్రెస్ మెటీరియల్, మైక్ సెట్‌ను అందించాను" అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నా దృష్టికి తీసుకువస్తే, నా పరిధిలో ఉన్నంతవరకు వాటి పరిష్కారానికి కృషి చేస్తాను. విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. పిల్లల భవిష్యత్తు కోసం చేసే సేవే నిజమైన సేవ" అని గద్దె రమణ పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన డ్రెస్ మెటీరియల్ అందించడంతో పాటు పాఠశాలకు మైక్ సెట్‌ను అందజేసిన గద్దె రమణకు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన




**కోడూరు,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మంజూరు చేసిన సాస్కి (SASCI) నిధులతో కోడూరు మండలంలో రెండు నూతన తారు రోడ్ల నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ శంకుస్థాపన చేయనున్నారు.కోడూరు నుంచి నరసింహాపురం మీదుగా విశ్వనాథపల్లి వరకు రూ.3.80 కోట్లతో 4.50 కిలోమీటర్ల నూతన తారు రోడ్డు నిర్మాణానికి విశ్వనాథపల్లి గ్రామం వద్ద ఉదయం 9 గంటలకు, అలాగే వేణుగోపాలపురం నుంచి సాలెంపాలెం వరకు రూ.2.48 కోట్లతో 3 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి వేణుగోపాలపురంలో శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

# మార్కెట్ కమిటీ అభివృద్ధి సహకరిస్తాను మంత్రి సుభాష్

- ఘనంగా కాకినాడ రూరల్ మార్కెట్ కమిటీ
- ప్రమాణ స్వీకారం






**కాకినాడ,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** నూతనంగా ఎన్నికైన కాకినాడ రూరల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. కాకినాడ రూరల్ వ్యవసాయం మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవం సోమవారం కాకినాడ ఇంద్రపాలెంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిగింది. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వర రావు (నానాజీ)అధ్యక్షత వహించారు. నూతనంగా ఎన్నికైన కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం మహోత్సవంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ కూటమిలో పనిచేసిన అందరికీ గుర్తింపు ఉంటుందని చెప్పారు. గడచిన రెండున్నర ఏళ్ల హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో నిర్వహించామని చెప్పారు. ప్రతిపక్ష వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని అభివృద్ధితో ఐక్యంగా తిప్పుకొట్టాలని పిలుపునిచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మాసుమేను మంగ మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో మార్కెట్ కమిటీ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానని చెప్పారు. అనంతరం మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, పిల్లి సత్యనారాయణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, రంబాల, వెంకటేశ్వరరావు, చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్మన్ సూర్యనారాయణ రాజు, కరప ఏఎంసీ చైర్మన్ ముద్రగడ్డ రమేష్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, గోదావరి డెల్టా నీటి సంఘం అధ్యక్షులు సునీల్, కుడా చైర్మన్ తలాటం సత్య, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన కూటమి నాయకులు పాల్గొన్నారు.

# జయహో బీసీ సభ వెనుక ఎమ్మెల్యే అసలు వ్యూహమేంటి?

- ముని్సిపల్ ఎన్నికల వేళ బీసీ ఓటు బ్యాంకుపై గురి.. ప్రత్యర్థి వర్గాలకు చెక్ పెట్టే యత్నమా?



**తిరువూరు,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరగనున్న 'జయహో బీసీ' సభ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. సాధారణంగా బీసీ వర్గాల సంక్షేమం, హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం సభలు నిర్వహించడం సహజమే అయినప్పటికీ.. మున్సిపల్ ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్న సమయంలో ఈ సభకు తెరలేపడం వెనుక రాజకీయ వ్యూహం ఉందనే చర్చ తిరువూరు రాజకీయ వర్గాల్లో సాగుతోంది. తిరువూరు పట్టణ రాజకీయాల్లో బీసీ సామాజిక వర్గాల ప్రాధాన్యత గణనీయంగా ఉండటంతో, వారిని ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా ఎమ్మెల్యే తన రాజకీయ బలాన్ని చాటుకోవాలని చూస్తున్నారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పదవి రిజర్వేషన్ ఏ సామాజిక వర్గానికి దక్కుతుందన్న అంశం కీలకంగా మారనుంది.

**ప్రత్యర్థి వర్గాలకు చెక్ పెట్టేందుకేనా?** తిరువూరు నియోజకవర్గంలో ఇప్పటికే ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఇతర ముఖ్య నేతల వర్గాల మధ్య రాజకీయ విభేదాలు గతంలో పలుమార్లు చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల మెప్మా ఎన్నికల సమయంలో కూడా ఎమ్మెల్యే మద్దతు ఇచ్చిన అభ్యర్థి విజయం సాధించడంతో స్థానిక రాజకీయ సమీకరణాలపై ఆసక్తి పెరిగింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల్లో కూడా తనకు అనుకూలమైన సామాజిక, రాజకీయ సమీకరణాన్ని ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నదే ఎమ్మెల్యే వ్యూహంగా కొందరు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. బలమైన బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి చైర్మన్ పదవి చేపడితే, పట్టణంలో తనకు అనుకూలమైన రాజకీయ బలం ఏర్పడటంతో పాటు ప్రత్యర్థి వర్గాల ప్రభావాన్ని కూడా పూర్తిగా తగ్గించవచ్చన్న అంచనా పార్టీలో పార్టీలో తిరుగులేని వ్యక్తిగా ఎమ్మెల్యేగా అధికారం మార్కు వేస్తారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు

# మానవతా హనుమాన్ జంక్షన్ ఆధ్వర్యంలో రూ.45 వేల విద్యా, వైద్య సహాయం




**హనుమాన్ జంక్షన్,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** మానవతా హనుమాన్ జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో విద్యా, వైద్య అవసరాల కోసం రూ.45 వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందించారు. స్థానిక మానవతా కార్యాలయంలో జరిగిన నెలవారీ సమావేశంలో గత నెల ఖర్చులను ఆమోదించడంతో పాటు, వచ్చే నెలలో చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మొదటి సంవత్సరం బీటెక్ చదువుతున్న గురిమెళ్ల మేఘనకు రూ.10 వేలు, ఎంబీబీఎస్ తిలక్ (హైదరాబాద్) రూ.5 వేలు, జేఎన్‌టీయూ విజయనగరంలో రెండో సంవత్సరం బీటెక్ చదువుతున్న మూకల లిఖిత లాస్యకు రూ.10 వేలు విద్యా సహాయంగా అందించారు. కొయ్యూరుకు చెందిన కే. ఏసుకు బైపాస్ శస్త్రచికిత్స నేపథ్యంలో మందుల కోసం రూ.10 వేలు, బాపులపాడుకు చెందిన సుంకర సుభాష్ చంద్రబోస్ రూ.10 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో మానవతా రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, ముఖ్య అతిథి సుంకర సుభాష్ చంద్రబోస్, అధ్యక్షురాలు ఇందిరాదేవి, కార్యదర్శి గణేష్‌బాబు, ట్రెజరర్ వెంకటస్వామి, కన్వీనర్ సత్యనారాయణ, డైరెక్టర్లు రామచంద్రరావు, రాజేశ్వరరావు, చలసాని సూర్యనారాయణ, సుబ్బాచారి, కార్యవర్గ సభ్యులు లక్ష్మణరావు, ప్రభాకరరావు, మల్లికార్జునరావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి, ప్రధానమంత్రి అధికారిక ఛాయాచిత్రాల ప్రదర్శనపై ముఖ్యమంత్రికి వినతి...

### కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ ని కలిసిన ప్రతినిధి బృందం



**మచిలీపట్నం,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** భారతదేశ అత్యున్నత రాజ్యాంగ పదవులకు, ప్రజాస్వామ్య వ్యవస్థకు తగిన గౌరవాన్ని ప్రతిబింబించే విధంగా భారత రాష్ట్రపతి భారత ప్రధానమంత్రి అధికారిక ఛాయా చిత్రాలను రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ప్రదర్శించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకోవాలని కోరుతూ కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీకి సోమవారం ప్రతినిధి బృందం వినతి పత్రం సమర్పించింది. కృష్ణా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు డా. బురగడ్డ శ్రీనాథ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ బాలాజీ ని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఈ అంశంపై సవివరంగా చర్చించింది. ప్రతినిధి బృందం సమర్పించిన వినతి పత్రంలో భారత రాష్ట్రపతి దేశానికి రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిని అలంకరిస్తూ భారత గణతంత్ర వ్యవస్థకు ప్రతీకగా నిలుస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా భారత ప్రధానమంత్రి దేశ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తూ ప్రజాస్వామ్య పరిపాలనా వ్యవస్థను ముందుకు నడిపించే అత్యున్నత కార్యనిర్వాహక బాధ్యతలను నిర్వర్తిస్తారని తెలిపారు. ప్రస్తుతం కొన్ని కార్యాలయాలలో వివిధ రకాల పద్ధతులు అమలులో ఉండగా రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన స్పష్టమైన విధానం అవసరమని ప్రతినిధి బృందం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అన్ని శాఖలు, జిల్లా స్థాయి కార్యాలయాలు మండల స్థాయి కార్యాలయాలు ప్రభుత్వ సంస్థలు ప్రభుత్వ రంగ కార్యాలయాలు ప్రజలకు సేవలందించే ఇతర ప్రభుత్వ కార్యాలయాలలో భారత రాష్ట్రపతి ప్రధానమంత్రి అధికారిక ఛాయాచిత్రాలను సముచితమైన స్థలంలో ప్రదర్శించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ చర్య ద్వారా దేశ అత్యున్నత రాజ్యాంగ సంస్థల పట్ల గౌరవం మరింత బలపడటంతో పాటు, ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ భావన ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యత పెరుగుతుందని ప్రతినిధి బృందం వివరించింది. జిల్లా కలెక్టర్ బాలాజీ ప్రతినిధి బృందం సమర్పించిన వినతి పత్రాన్ని స్వీకరించి వారి అభిప్రాయాలను శ్రద్ధగా ఆలకించారు. ఈ సందర్భంగా డా. బురగడ్డ శ్రీనాథ్ మాట్లాడుతూదేశ రాజ్యాంగ వ్యవస్థకు సంబంధించిన అత్యున్నత పదవుల పట్ల గౌరవాన్ని పెంపొందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. వినతి పత్రాన్ని సానుకూలంగా స్వీకరించి ముఖ్యమంత్రి పరిశీలనకు పంపిస్తామని హామీ ఇచ్చిన కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ కి ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో డా. బూరగడ్డ శ్రీనాథ్ కూనపురెడ్డి శ్రీనివాసరావు దూళిపాల రాము హరికృష్ణ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం వర్రె రాజశేఖర్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 36 సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి కూటమి ప్రభుత్వం సన్నద్ధం

- జలయజ్ఞం పేరుతో గత పాలకుల దోపిడీపై ఎమ్మెల్యే, టిడిపి పోలీట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ధ్వజం




**కాకినాడ,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ స్పష్టం చేశారు. సోమవారం కాకినాడ లో జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులు, పూర్తి చేయాల్సిన గడువులు, గత వైసిపి ప్రభుత్వ అవినీతిపై పలు కీలక విషయాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను ఎంపిక చేసి, వాటి పూర్తికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేశారని ఆయన తెలిపారు. ఈ 36 ప్రాజెక్టుల మొత్తం అంచనా వ్యయం రూ. 78,135 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ. 44,614 కోట్లు ఖర్చయ్యాయని, మిగిలిన రూ. 32,199 కోట్ల పనులను పూర్తి చేయడానికి షెడ్యూల్స్ ఖరారు చేశామన్నారు. ఇందులో భాగంగా పోలవరం ప్రధాన ప్రాజెక్టును మార్చి 2027 నాటికి, పూర్తి చేస్తామని అన్నారు. పోలవరం ఎడమ కాలువను అనకాపల్లి వరకు నేటితో పూర్తి చేసామని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను సైతం ఆగస్టు 2026 నాటికి, చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ఫేజ్-1ను జూలై 2027 నాటికి పూర్తి చేస్తామన్నారు. గోదావరి డెల్టా ఆధునికీకరణకు రూ. 3,000 కోట్లు కేటాయించి జూన్ 2028 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అలాగే విజయవాడను ముంచెత్తిన బుడమేరుకు సంబంధించి మళ్లింపు కాలువ పనులను, కాటన్ బ్యారేజీ గేట్ల పనులను జూన్ 2027 నాటికి పూర్తి చేసి వరద ముప్పుకు శాశ్వత పరిష్కారం చూపుతామని ప్రకటించారు. రాష్ట్రంలో తీవ్రమైన ఎల్ నినో పరిస్థితులు ఉన్నప్పటికీ కృష్ణా, గోదావరి ఆయకట్టును కాపాడుకోగలిగామంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపు వల్లేనని ఆయన ప్రశంసించారు. ఎప్పటి నుంచో రైతులు ఆశగా ఎదురుచూస్తున్న పోలవరం ఎడమ కాలువ (లెఫ్ట్ మెయిన్ కెనాల్) పనులు 87 శాతం పూర్తయ్యాయని, ఈ కాలువ ద్వారా నీటి విడుదలకు సంబంధించి సెప్టెంబర్ 2వ తేదీన అనకాపల్లి వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు పనులను లాంఛనంగా ప్రారంభించి "జలహారతి" ఇవ్వనున్నారని వెల్లడించారు. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టును 1996లోనే రూ. 10,200 కోట్ల అంచనాలతో చంద్రబాబు గారు ప్రారంభిస్తే, గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం కేవలం రూ. 981 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఇప్పుడు ఆ ప్రాజెక్టు క్రెడిట్ తమదే అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. జలయజ్ఞం పేరుతో గత పాలకులు సుమారు రూ. 43 వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఈడీ నిర్ధారించిందని ఆయన గుర్తుచేశారు. రివర్స్ టెండరింగ్ ద్వారా రూ. 800 కోట్లు ఆదా చేశామని గొప్పలు చెప్పుకున్న జగన్.. ప్రాజెక్టు వద్దే ఉచితంగా దొరికే ఇసుకను తరలించడానికి 'ఎక్సవేషన్, లీడ్ అండ్ లిఫ్ట్' అనే పేరుతో అదే కాంట్రాక్టర్లకు ఆ డబ్బంతా తిరిగి దోచిపెట్టారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రాజెక్టు కాలువలు తవ్వింది నిజమేనని, అయితే కేవలం పురుషోత్తపట్నం నుంచి ప్రత్తిపాడు వరకు మెత్తటి మట్టి ఉన్న చోట మాత్రమే తవ్వి ఆ మట్టిని గుట్టలుగా పోసి వందల కోట్లు జేబులో వేసుకున్నారని ఆరోపించారు. కష్టమైన కొండలు, గుట్టల ప్రాంతాలను కాలువల తవ్వకానికి పనికిరాకుండా గాలికొదిలేశారని దుయ్యబట్టారు. ఎటువంటి ప్రణాళిక లేకుండా గత ప్రభుత్వం వదిలేసిన ప్రాజెక్టులకు తిరిగి జీవం పోస్తూ, రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. ఈ పత్రికా సమావేశంలో కాకినాడ జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా పాల్గొన్నారు.

# అంగ రంగ వైభవంగా కొప్పినీడి ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం




**కృత్తివెన్ను,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లెపాలెంలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేయుచున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొ ప్పినీడి సూర్య ప్రకాష్ ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం సోమవారం రంగ రంగ వైభవంగా జరిగింది. గత 34 సంవత్సరాలుగా కృత్తివెన్ను మండలంలో ఎస్ జి టి గా స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ గా పని చేస్తూ లక్షలాది రూపాయలు పాఠశాలలకు విరాళాలుగా సేకరించి ఉపాధ్యాయుల విద్యార్థుల పాఠశాలల అభ్యున్నతికి కృషిచేసిన మహోన్నతమైన వ్యక్తి అని పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ కొనియాడారు భీమవరం శాసనసభ్యులు కులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ మా సోదరుడైన సూర్య ప్రకాష్ నిత్యం విద్య బోధిస్తూనే సమాజ సేవలో ఉంటారని బంధువులంటే ఎంతో ఆప్యాయత కలిగి ఉంటారని ఐదు అవార్డులు అందుకున్న నా సోదరుడు మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.పాఠశాల అనంతరం జరిగిన ఉద్యోగ విరమణ సభలో నరసాపురం మాజీ శాసనసభ్యులు బండారు మాధవ నాయుడు మరియు వాకర్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 201 గవర్నర్ వడుపు గోపి భీమవరం ప్రముఖులు ఆరేటి ప్రకాష్ గన్నాబత్తుల శ్రీనివాస్ భీమాల శ్రీరామమూర్తి సరి పిడకల రామారావు టివి ప్రసాదు బోసు రాజు బిఎస్ఆర్ చెరుకువాడ రంగ సాయి మొగల్ల రమణారావు కృత్తివెన్ను మండల అధ్యక్షులు కూనసాని గరుడ ప్రసాద్ జడ్పిటిసి రత్నకుమారి పలువురు అధికారులు అనధికారులు రాజకీయ ప్రముఖులు వందలాదిగా హాజరై ఆయనకు వీడ్కోలు పలికారు సభకు అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ మరియు ఉపాధ్యాయులు ప్రసంగిస్తూ సూర్య ప్రకాష్ గారి స్థానం ఎవరు భర్తీ చేయ లేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యాయులు అధికంగా పాల్గొన్నారు.

# సుదీర్ఘకాల నివాసిత పేదలకు పట్టాలు ఇవ్వండి

- వందే గోభారతి జాతీయ ప్రధాన కార్యదర్శి
- పెనుగొండ రామచంద్రారావు



**విస్సన్నపేట,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** సొంత ఇంటి కలల సాకారం చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులలో ఉంటూ చెరువు, డొంక మరియు వాగుల మిగులు స్థలంలలో గృహాలు నిర్మించుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని బిజెపి తిరువూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు వందే గోభారతి జాతీయ ప్రధాన ప్రధాన కార్యదర్శి పెనుగొండ రామచంద్ర రావు విజ్ఞప్తి చేశారు. వాటికి పొజిషన్ చూపించి ఇంటి నిర్మాణాలకు గృహ నిర్మాణ శాఖ ద్వారా రుణాలు అందించాలని కోరారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాస్కెట్బాల్ కోర్ట్ ప్రారంభోత్సవం...



**నూజివీడు,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** క్రీడా దినోత్సవం పురస్కరించుకొని సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యనమదలలో బాస్కెట్ బాల్ కోర్టును ప్రారంభించి విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేసిన నూజివీడు ఉప విద్యాశాఖ అధికారి డాక్టర్ పి ఎస్ సుధాకర్ అలాగే ఉప విద్యాశాఖ అధికారి నీ శాలువాతో సత్కరించిన ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయ బృందం.

# కల్లూరి కేశవాచారీ ని పరామర్శించిన బీసీ నేతలు..



**పెనుగంచిప్రోలు,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలోని శ్రీ తిరుపతమ్మ దేవస్థానం డైరెక్టర్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కల్లూరు శ్రీవాణి భర్త బీసీ నాయకులు కల్లూరు కేశవాచారి ఇటీవల విజయవాడలో వారం రోజులు క్రితం మోకాళ్లు ఆపరేషన్ చేయించుకుని ఇంటికి వచ్చారని తెలుసుకుని కల్లూరి కేశవాచారిని పరామర్శించిన ఎన్ టీ ఆర్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు శ్రీ తిరుపతమ్మ దేవస్థా నం కళ్యాణ కట్ట అధ్యక్షులు కొలిపాక బ్రహ్మం మరియు రాష్ట్ర బీసీ మాజీ కార్పొరేషన్ డైరెక్టర్ చేని రాంబాబు. నాయి బ్రాహ్మణ జేఏసీ నాయకులు ఏలూరు శ్రీనివాసరావు ఏలూరు చిన్న నాగబాబు. నాగార్జున తదితరులు బీసీ నాయకులు కల్లూరు కేశవాచార్యు లను వారి స్వగృహమునకు వెళ్లి వారి కుటుంబ సభ్యులు లను వారి ని.పరామర్శించారు అనంతరం వారు మాట్లాడుతూ మీరు త్వరలోనే కోలుకొని ఆయురారోగ్యాలతో కోలుకుంటారని అన్నారు.

## తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకైన బోనాల పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోండి

# -పిఏసి చైర్మన్ అరికపూడి గాంధీ



**శేరిలింగంపల్లి,ఆగస్టు 31 (వార్తాప్రభ):**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బోనాల పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ మసీద్‌బండ విలేజ్‌లో సీనియర్ నాయకుడు మారబోయిన రాజు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి,తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డితో కలిసి గాంధీ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు బోనాల శుభాకాంక్షలు తెలిపారు.అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు.బోనాల ఉత్సవాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసిందని, శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 92 దేవాలయాలకు రూ.30.71 లక్షలు కేటాయించిందని తెలిపారు.భక్తులకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, భద్రత, ట్రాఫిక్, వైద్య సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన కోల గురుమూర్తికి ఘన సన్మానం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వార్తా ప్రభ (ప్రతినిధి) ఆగస్టు 31:** సింగరేణి, సింగరేణి సంస్థలో 43 సంవత్సరాల పాటు నిబద్ధతతో సేవలందించిన కోల గురుమూర్తి హెడ్ ఓవర్‌మెన్‌గా పదవీ విరమణ చేశారు ఈ సందర్భంగా సోమవారం ఆయనకు తోటి ఉద్యోగులు పలువురు షాలోతో సత్కరించి ఘన సన్మానం చేశారు ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు పలువురు మాట్లాడుతూ 1982 అక్టోబర్ 12న బదిలీ వర్కర్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదుగుతూ హెడ్ ఓవర్‌మెన్ స్థాయికి చేరుకున్నారు అన్నారు నాలుగు దశాబ్దాలకు పైగా సింగరేణి సంస్థ అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషించారని వృత్తి పట్ల నిజాయితీ, అంకితభావం, క్రమశిక్షణకు ఆయన మారుపేరుగా నిలిచారు అని అన్నారు ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా, కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవనం గడపాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో కోలా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

## ద్వారకానగర్ మల్టీపర్పస్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

**రూ. 21.50 లక్షల నిధులతో పనులను ప్రారంభించిన కొలన్ హన్మంత్ రెడ్డి**

**నిధులు మంజూరు చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కాలనీవాసుల ధన్యవాదాలు**



**జీడిమెట్ల, ఆగస్టు 31, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని 284వ డివిజన్ గణేష్ నగర్‌లోని ద్వారకా నగర్‌లో మల్టీపర్పస్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో ఈ భవన నిర్మాణానికి రూ. 21.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపడుతున్న నిర్మాణ పనులకు సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడారు. కాలనీల సమగ్ర అభివృద్ధికి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ మల్టీపర్పస్ హాల్ నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు వివిధ సామాజిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కాలనీ వాసులు, ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కే.ఎం. గౌరీష్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మాజీ రాష్ట్రపతి, భారతరత్న స్వర్గీయ ప్రణబ్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ముఖ్యమంత్రి తో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ **– వార్తా ప్రభ, హైదరాబాద్**

# మానవతా సేవలకు ఘనమైన గుర్తింపు

## మారమోని శ్రీశైలం యాదవ్‌కు "సేవారత్న" పురస్కారం




**హైదరాబాద్, ఆగస్టు31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సమాజ సేవలో నిరంతరం ముందుంటూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్న మారమోని శ్రీశైలం యాదవ్‌కు ప్రతిష్టాత్మక "సేవారత్న అవార్డు" లభించింది. పేదలు, నిరుపేదలు, అవసరమైన వారికి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేశారు.మారమోని శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో రక్తదానం, అన్నదానం, విద్యార్థుల విద్యా ఫీజుల చెల్లింపు, ఆసుపత్రుల్లో వైద్య సహాయం, అవసరమైన వారికి మెడికల్ సహాయం, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు ఆహార పంపిణీ, చలికాలంలో నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆపదలో ఉన్నవారికి తన వంతు సహాయాన్ని అందిస్తూ, సమాజంలో మానవతా విలువలను పెంపొందించే దిశగా ఆయన సేవా కార్యక్రమాలను విస్తరిస్తున్నారు.హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభ మెయిన్ హాల్‌లో నిర్వహించిన "స్వర సప్త సంగీత వాద్య నృత్య సమ్మేళనం" కార్యక్రమంలో నిర్వాహకులు బి. నరేందర్ యాదవ్ ఆధ్వర్యంలో మారమోని శ్రీశైలం యాదవ్‌కు "సేవారత్న అవార్డు"ను ఘనంగా అందజేశారు.ఈ సందర్భంగా శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ, "సమాజానికి సేవ చేయడం నా బాధ్యతగా భావిస్తున్నాను. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, పేదలకు సహాయం చేయడం ద్వారా లభించే సంతృప్తి ఎంతో గొప్పది. నాకు లభించిన ఈ సేవారత్న అవార్డు మరింత బాధ్యతను పెంచింది. భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాను" అని తెలిపారు.తన సేవా ప్రయాణానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ శ్రీశైలం యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. మానవతా సేవల్లో ఆయన చేస్తున్న కృషికి పలువురు అభినందనలు తెలియజేస్తూ, ఈ అవార్డు మరిన్ని సేవా కార్యక్రమాలకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# బాధలో ఉన్న కుటుంబాలకు మైనంపల్లి భరోసా

## మానవతా దృక్పథంతో బాధిత కుటుంబాలకు పరామర్శ




**మల్కాజిగిరి ఆగస్టు31 :(వార్తా ప్రభ ప్రతినిధి):** ఆపదలో ఉన్న కుటుంబాలను పరామర్శిస్తూ వారికి ధైర్యం చెప్పడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. రాజకీయాలకు అతీతంగా కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవాలనే మానవతా దృక్పథంతో ఆయన సోమవారం ఆకునూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. ఆకునూరు గ్రామ మాజీ ఎంపీటీసీ కరెడ్ల రాంరెడ్డి సతీమణి ప్రమీల ఇటీవల మృతి చెందడంతో మైనంపల్లి హనుమంతరావు వారి నివాసానికి వెళ్లారు. ప్రమీల కుమారుడు, కేఆర్ఆర్ ట్రస్ట్ నిర్వాహకుడు కరెడ్ల రాజేశ్వర్‌రెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ప్రమీల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ "కుటుంబంలో ఒకరిని కోల్పోవడం మాటల్లో చెప్పలేని విషాదం. ప్రమీల మృతి కుటుంబ సభ్యులతో పాటు గ్రామ ప్రజలకు కూడా తీరని లోటు. ఆప్యాయతతో అందరితో కలిసిమెలిసి ఉండే ఆమె జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచిపోతాయి. ఈ విషాద సమయంలో రాజేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి. వారి కుటుంబానికి నా అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం మల్కాజిగిరి సర్కిల్ నేరేడ్‌మెట్‌కు చెందిన ఈనాడు విలేకరి మహేష్ తండ్రి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న మైనంపల్లి, ఆకునూరులోని మహేష్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహేష్‌ను, కుటుంబ సభ్యులను ఓదార్చి, తండ్రి మృతికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, కష్టకాలంలో వారికి తన సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం, వారి బాధను పంచుకోవడం మానవతా విలువల్లో భాగమని మైనంపల్లి పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమ్ము రవి, మాజీ సర్పంచ్ వెలగల రఘువీర్, మత్స్యశాఖ మాజీ చైర్మన్ బోయిని రాజు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆకుల రాజు, మాజీ ఎంపీటీసీలు సుంకరి శ్రీధర్, పల్లె కనకయ్య, పార్టీ నాయకులు కోయినేని నరసయ్య, మల్కాజిగిరి సర్కిల్ ఈస్ట్ ఆనంద్‌బాగ్ మాజీ కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ ఎస్.ఆర్.ప్రసాద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.ఎన్.వి. సతీష్‌కుమార్, సత్యనారాయణ, బాబా, చుంకు శ్రీనివాస్, రాందాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల్లో మృతి చెందిన పోలీసు కుటుంబాలకు

# రూ.3 కోట్ల బీమా అందజేసిన డిజిపి

**ఒక్కో కుటుంబానికి రూ.కోటి చొప్పున చెక్కుల అందజేత**




**హైదరాబాద్, ఆగస్టు31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విధి నిర్వహణలో వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు తెలంగాణ డిజిపి సి. వి. ఆనంద్ అండగా నిలిచారు. ముగ్గురు పోలీసు సిబ్బంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున మొత్తం రూ.3 కోట్ల ను సోమవారం డిజిపి కార్యాలయంలో మృతుల కుటుంబ సభ్యులకు బీమా చెక్కులను డిజిపి అందించారు.

**రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి** శంకర్‌పల్లి పరిధిలో 2025 ఫిబ్రవరి 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో 2018 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ వెలిమడ తండా తెల్లపుర జరిగిన రోడ్డు ప్రమాదంలో ముత్తంగి శ్రీనివాస్ మృతి చెందారు. ఆయన తండ్రి ముత్తంగి యాదయ్యకు డిజిపి సి. వి. ఆనంద్ రూ.1 కోటి బీమా చెక్కును అందజేశారు.

**ఇద్దరు సిబ్బంది కూడా..** నల్లగొండ జిల్లా కనగల్ లో పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న 2004 బ్యాచ్ పోలీసు హెడ్ కానిస్టేబుల్ బోలెపల్లి సైదులు 2025 జూన్ 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వరంగల్ కు చెందిన మరో పోలీసు కానిస్టేబుల్ కె.వెంకటరెడ్డి 2026 మార్చి 10న లారీ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందారు. వెంకట్ రెడ్డి వరంగల్ లోని ఏఆర్పిసిగా హెడ్ క్వార్టర్స్ లో విధిని నిర్వహిస్తుండగా వెనుక నుంచి లారీ తాకడంతో వెంకట్ రెడ్డి మృతి చెందారు. ఈ మృతులందరికీ ఎస్బిఐలో ఇన్సూరెన్స్ అకౌంట్ ఉండటం వలన బ్యాంక్ అధికారులతో సంప్రదించి డిజిపి వీరి కుటుంబాలకు కూడా ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున బీమా పరిహారాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు డిజిపి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు పోలీసుశాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబాల సంక్షేమానికి శాఖ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిజిపి తో పాటు ఎస్‌బీఐ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను వెంటనే అమలు చేయాలి

- **మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో నేతల డిమాండ్**
- **సెప్టెంబర్ 2 నుండి నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిన నాయకులు**




**కుత్బుల్లాపూర్, ఆగస్టు 31, (వార్తాప్రభ) :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధ్యక్షతన నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ 132 డివిజన్ జనరల్ సెక్రటరీ కుంట సిద్దిరాములు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి పంపిణీ చేశారని, అలాగే 58, 59 జీఓల ద్వారా పేదల భూములకు శాశ్వత పట్టాలు అందజేశారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జేసీబీలు పెట్టి హైడ్రాను ఏర్పాటు చేసి పేదల ఇళ్లను నిష్కారణంగా కూల్చివేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం తెచ్చిన 22ఎ జీఓ మధ్యతరగతి ప్రజలకు శాపంగా మారిందని విమర్శించారు.100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను, ఇతర హామీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, 1000 రోజులు గడుస్తున్నా ఏ ఒక్క హామీని సక్రమంగా నెరవేర్చలేదని కుంట సిద్దిరాములు విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారని, కళ్యాణలక్ష్మి పథకాన్ని నీరుగార్చారని, మహిళలకు ఇచ్చిన నెలకు రూ. 4,000 పింఛన్ హామీని అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుండి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై, నెరవేర్చని హామీలపై విస్తృత నిరసన కార్యక్రమాలు చేపట్టాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇచ్చిన ప్రతీ హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, తెలంగాణ ఉద్యమ నాయకులు, డివిజన్ పార్టీ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, మహిళలు మరియు భారీ ఎత్తున పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు 100 శాతం పాఠశాలలలో ఉండేలా చర్యలు తీసుకోవాలి ..జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్, ఆగస్టు31 :(వార్తా ప్రభ ప్రతినిధి):** విద్యార్థులు 100 శాతం ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విధంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి లతో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సి.ఆర్.పి. లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## ఘనంగా శివ సింగ్ జన్మదిన వేడుకలు



**శేరిలింగంపల్లి,ఆగస్టు 31 (వార్తాప్రభ):**గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివ సింగ్ జన్మదిన వేడుకలు నానక్‌రామ్‌గూడలోని కాళీమాత ఆలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శివ సింగ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.శాలువాతో సన్మానించి, కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు అందజేశారు.ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ.. శివ సింగ్ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజా సేవలో మరింత అంకితభావంతో పనిచేసి మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు.గచ్చిబౌలి డివిజన్‌లో పార్టీని బలోపేతం చేస్తూ కార్యకర్తలను సమన్వయం చేసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.అనంతరం కాళీమాత ఆలయంలో గంగాధర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువ నాయకులు, అభిమానులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొని శివ సింగ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## జవహర్ నగర్ మూడవ డివిజన్ కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షుడిగా మహమ్మద్ రఫీక్ నియామకం



**జవహర్ నగర్, ఆగస్టు 31(వార్తా ప్రభ)**మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో జవహర్ నగర్ మూడవ డివిజన్ అధ్యక్షులుగా మహమ్మద్ రఫీక్ నియమితులయ్యారు.ఈ మేరకు మేడ్చల్ నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ ఎండి ఖాజామొయినుద్దీన్ నియామక పత్రాన్ని అందజేశారు. టి పి సి సి మైనారిటీ చైర్మన్ మహమ్మద్ ఇర్ఫాన్ అలీ, మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి అధ్యక్షులు మరియు మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ మాజీ మేయర్ డివిజన్ అధ్యక్షులు దొంతగాని శాంతి కొటేషగౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, మైనారిటీ చైర్మన్ మిర్జా అజీజుల్లా బేగ్ ల అనుమతి మరియు ఆమోదంతో ఈ నియామకం జరిగినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగాన్ని డివిజన్ స్థాయిలో బలోపేతం చేయడానికి, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేయాలని నూతన అధ్యక్షుడికి సూచించారు.ఈ సందర్భంగా మహమ్మద్ రఫీక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, చింతల శ్రీనివాస్, గజ్వేల్ శంకర్, మాట్లా వినయ్, వీర్ల బుజంగం, సోమేశ్ చారీ, కయుమ్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ విగ్రహ నిమజ్జనం కోసం తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతూ..

**ఎం ఎం సి కమిషనర్ కి వినతి పత్రం సమర్పించిన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ ఏనుగు రాజిరెడ్డి**




**కాప్రా, ఆగస్టు 31(వార్తా ప్రభ)** కాప్రా చెరువులో గణేష్ విగ్రహ నిమజ్జనం కోసం తక్షణ ఏర్పాట్లు చేయాలని కోరుతూ, కాప్రా చెరువు వద్ద భారీ క్రేన్‌లు, కృత్రిమ నిమజ్జన చెరువులు, ఎత్తైన దీపాలు, ప్రథమ చికిత్స వైద్య శిబిరాలు వంటి పౌర మరియు లాజిస్టికల్ ఏర్పాట్లు చేయాలని, హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎం ఎం సి) కమిషనర్ కి వినతి పత్రం సమర్పించినభాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ నియోజకవర్గం, కన్వీనర్ ఏనుగు రాజిరెడ్డి, ఉప్పల్ నియోజకవర్గం కో కన్వీనర్ పర్కిబండ సందీప్, కాప్రా డివిజన్ కన్వీనర్ రాజు వంశరాజ్, వంపుగూడ డివిజన్ కన్వీనర్ లింగారి హరీష్, డాక్టర్!ఏ.ఎస్.రావు నగర్ డివిజన్ కన్వీనర్ సోమేష్ నాయుడు, గామ హౌసింగ్ బోర్డ్ డివిజన్ కన్వీనర్ విశాల్ రెడ్డి, మరియు ఉత్సవ సమితి సభ్యులు కలిసి, మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ లో కమిషనర్ కి వినతి పత్రం అందజేశారు.

# సంపాదకీయం

## కూటమికి 'వెలిగొండ'... ఓట్ల సిరులు!

ఒక ప్రాజెక్టు రాజకీయాలపై ప్రభావం చూపుతుందా? ఓటు బ్యాంకుగా మారుతుందా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తుంది. ముఖ్యంగా కరువు పీడిత ప్రకాశం, మార్కాపురం(కొత్త జిల్లా) నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో తాజాగా సీఎం చంద్రబాబు ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టు కీలక మార్పులు తీసుకురానుంది. తద్వారా.. ఆయా మండలాల్లోని సుమారు 6 లక్షల మందికిపైగా ప్రజల జీవితాల్లోనూ మార్పు తీసుకువస్తుందని అంచనా వేస్తున్నారు.ఇక, సాగు భూములు మునుపటి మాదిరిగా చుక్కనీటి కోసం బిక్కమొహం వేయకుండా.. జల జల పారే కృష్ణానీటితో కళకళ లాడడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదేసమయంలో నిన్నమొన్నటి వరకు ఫ్లోరైడ్ నీరు లేదా .. ప్రభుత్వం ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్న నీటిపైనే ఆధారపడిన ప్రజలకు ఇప్పుడు .. కృష్ణానది నీరు గంగా జలంలా.. వారి దాహార్తిని తీర్చనుంది. అదేసమయంలో ఫ్లోరైడ్ ముప్పును కూడా పరిహరించనుంది.మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని దాదాపు లక్షా 19 వేల ఎకరాలకు సాగునీరు ఈ వెలిగొండ తొలి దశ ప్రాజెక్టు ద్వారా లభిస్తుంది. ముఖ్యంగా ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలలోని సుమారు 4 లక్షల మందికి స్వచ్ఛమైన తాగునీరు అందుతుంది. ఇవన్నీ కూడా రాజకీయంగా ప్రభావితం చూపించే అంశాలే కావడం గమనార్హం. అదేసమయంలో ఇప్పటికే ఉమ్మడి ప్రకాశం , నెల్లూరు జిల్లాల్లో టీడీపీ సహా కూటమి పార్టీలకు బలం ఉంది. అయితే.. 30 ఏళ్ల కల సాకారం కావడం.. రైతులకు నీటిని సమృద్ధిగా అందిస్తున్న నేపథ్యంలో మరింతగా కూటమి ప్రభావం పెరుగుతుందన్న అంచనాలు వస్తున్నాయి.వెలిగొండ ప్రాజెక్టుతో కడపకు జరిగే ప్రయోజనం మరింత చర్చనీయాంశం. ఈ జిల్లాలోని బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాలతో పాటు ఇతర ప్రాంతాల్లోని కరవు పీడిత మండలాల్లో ఉన్న వేలాది ఎకరాల ఆయకట్టుకు శాశ్వతంగా సాగునీరు అందుతుంది. శ్రీశైలం జలాశయం నుండి తరలించే కృష్ణా వరద జలాలు ఈ ప్రాంతాల్లోని వ్యవసాయ స్థిరత్వానికి తోడ్పడతాయి. నీటి లభ్యత పెరగడం వల్ల రైతులు అరటి, బొప్పాయి వంటి వాణిజ్య, ఉద్యానవన పంటల సాగును మరింత పెంచుకునే అవకాశం ఉంది. పరోక్షంగా కూటమికి ఇక్కడ ఓటు బ్యాంకు పెరుగుతుందన్న అంచనాలు ఉన్నాయి. మొత్తంగా వెలిగొండ.. ప్రజలకు నీటి సిరులు అందిస్తే.. కూటమికి ఓట్ల సిరులు అందించడం ఖాయమని చెబుతున్నారు.

## వైభవంగా శ్రీ నాగ సాయి బాబా దీక్ష మందిరం నందు నాలుగో వార్షికోత్సవ వేడుకలు



**విజయవాడ పశ్చిమ ఆగష్టు 31 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ రూరల్ పి నైనవరం అంబాపురం గ్రామంలో దినదిన అభివృద్ధి చెందుతున్న శ్రీ నాగ సాయి బాబా దీక్ష మందిరం నందు విగ్రహ ప్రతిష్ట జరిపి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భక్తులు నాగ సాయి బాబా ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజార్లు మంత్రాలు చదివి అభిషేకములు పుష్పాలంకరణ హోమములు శ్రీ ముత్యాల సాంబశివ శర్మ మరియు శివరామకృష్ణ ప్రసాదు శర్మ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసినందుకు ఆలయ ధర్మకర్త షేక్ లాల్ భాష భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

## మెరుగైన వైద్యం కోసం ఎల్ ఓ సీ పత్రాలు అందజేత



**విజయవాడ పశ్చిమ ఆగష్టు 31 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్. ఓ. సి ) లను జారీ చేస్తున్నారు. ఎమ్మెల్యే , ఆదేశాలతో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ నాగోతి రామారావు,43 వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు మోరబోయిన రాంబాబు తో కలిసి భవానిపురం, ఎన్డీయే కార్యాలయంలో బాధితులకు ఎల్ ఓ సీ పత్రాలను అందజేశారు...నాలుగు స్తంభాల సెంటర్ కు చెందిన శీలం రేఖ (47) గర్భాశయ సంబంధిత సమస్యతో బాధపడుతూ వైద్య సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 4.94 లక్షల విలువైన ఎల్ ఓ సీ ను అందజేశారు.. ఊర్మిళా నగర్ కు చెందిన షేక్ నజీర్ భాష (60) నరాల సంబంధిత సమస్యతో బాధపడుతూ వైద్య సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 5 .83 లక్షల విలువైన ఎల్ ఓ సీ ను అందజేశారు త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ ను అందజేసిన చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరి కు బాధితుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# అర్జీల పరిష్కారంలో జిల్లాను ముందంజలో నిలపాలి

**- గడువులోగా పరిష్కారంతో పాటు నాణ్యతకూ పెద్దపీట వేయాలి- అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావులేదు- జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 161 అర్జీలు- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**





**విజయవాడ, ఆగస్టు31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజా స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అందే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు, నాణ్యమైన పరిష్కారం అందించి ప్రజల సంతృప్తి స్థాయిని పెంచడం ద్వారా గ్రీవెన్స్ పరిష్కారంలో రాష్ట్రంలో జిల్లాను ముందంజలో నిలిపేందుకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులతో కలిసి సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ 46, పోలీస్ 23, పురపాలక పట్టణ అభివృద్ధి 23, పంచాయతీరాజ్ 10 అర్జీలతో సహా మొత్తం 161 అర్జీలు అందాయి. కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అర్జీదారుని సమస్య వాస్తవంగా పరిష్కరించబడిందా, ఆయన సంతృప్తి చెందారా అనేదే అర్జీ పరిష్కారానికి అసలు గీటురాయి అని స్పష్టం చేశారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వేయర్లు అర్జీలను కేవలం కార్యాలయ స్థాయిలో పరిశీలించకుండా స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను పరిశీలించాలని, అర్జీదారులతో నేరుగా మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని, నిబంధనల మేరకు న్యాయబద్ధమైన, శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. ప్రత్యేకించి జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, వాటి పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిష్కారం అనంతరం కూడా అర్జీదారుడి సంతృప్తి స్థాయిని దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ప్రజల సంతృప్తి, ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్, పరిష్కార నాణ్యతను ప్రధాన ప్రమాణాలుగా తీసుకుని అర్జీలను పరిష్కరించి, గ్రీవెన్స్ పరిష్కారంలో జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపేందుకు అధికారులు సమష్టిగా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఆదేశించారు.

**స్వచ్ఛాంధ్రలో జిల్లా మెరవాలి:**స్వచ్ఛాంధ్ర-2026 అవార్డుల విషయంలో జిల్లాకు ఎక్కువ అవార్డులు సాధించేలా అధికారులు సమష్టిగా కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ప్రతి శాఖ, స్థానిక సంస్థ తమ పరిధిలో చేపట్టిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, వాటి ఫలితాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తుల చెప్పులపైనా పన్ను వేయడమే కూటమి ప్రభుత్వ భక్తి విధానమా?

**● భక్తుల జేబులు ఖాళీ చేయడమే దుర్గగుడి పాలకమండలి, ఈఓల లక్ష్యమా? ● భక్తులపై అదనపు భారాన్ని వెంటనే ఉపసంహరించుకుని, చెప్పుల స్టాండ్‌ను ఉచితంగా నిర్వహించాలి - కామరాజ్ హరీష్**



**విజయవాడ పశ్చిమ ఆగష్టు 31 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానాన్ని వ్యాపార కేంద్రంగా మార్చేస్తూ కూటమి ప్రభుత్వం భక్తుల నెత్తిన అదనపు భారాన్ని మోపడాన్ని వైఎస్సార్సీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి కామరాజ్ హరీష్ కుమార్ సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటన లో తీవ్రంగా ఖండించారు.ఈ సందర్బంగా హరీష్ మాట్లాడుతూ ఇంద్రకీలాద్రికి వచ్చే కోట్లాది మంది భక్తులకు కనీస ప్రాథమిక సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యతను గాలికి వదిలేసి,దేవాదాయ శాఖ నిబంధనలకు విరుద్ధంగా చెప్పుల స్టాండ్ నిర్వహణ పేరిట జతకు రూ.5 వసూలు చేయడానికి సిద్ధపడటం దుర్మార్గంమ న్నారు.కాంట్రాక్టర్ల కాలపరిమితి ముగియడంతో దేవస్థానమే నేరుగా నిర్వహించే సాకుతో భక్తుల నుంచి విపరీతంగా పిండుకోవాలని దుర్గగుడి ఈఓ,పాలకమండలి చైర్మన్ చూడటం శోచనీయమ న్నారు.ఇప్పటివరకు కాంట్రాక్టర్ల ద్వారా రూ. 70 లక్షలకు పైగా ఆదాయం పొందుతూ,భక్తులకు అందాల్సిన ఉచిత సేవలను నిలిపివేసి ప్రతీ చిన్న సౌకర్యానికి బాదుడే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.దుర్గగుడి పాలకమండలి,ఈఓ వెంటనే స్పందించి భక్తుల నుంచి జతకు రూ.5 వసూలు చేసే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.5 రూపాయలకు పెంచే నిర్ణయం వెనక ఓ పెద్ద కుట్రకోణం దాగి ఉందన్నారు.చెప్పుల స్టాండ్‌ను దేవస్థానమే భక్తులకు పూర్తిగా ఉచితంగా నిర్వహించాలని వైఎస్సార్సీపీ డిమాండ్ చేస్తోందన్నారు.లేనిపక్షంలో భక్తుల ప్రయోజనాల కోసం దేవాదాయ శాఖ వైఖరిపై వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరిచ్చారు.

# వ్యాధి నిరోధక కార్యక్రమాల్లో సుబ్రమణ్యేశ్వరి సేవలు ప్రశంసనీయం

**- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్ బాబు**



**విజయవాడ, ఆగస్టు31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్‌లో దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు అడిషనల్ డైరెక్టర్‌గా సుబ్రమణ్యేశ్వరి అందిశీచిన సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్ బాబు కొనియాడారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలో పనిచేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, జపనీస్ ఎన్‌సెఫలైటిస్ (జె.ఈ.), మెలియోయిడోసిస్ వంటి వ్యాధుల నియంత్రణకు సుబ్రమణ్యేశ్వరి తీవ్రశీగా కృషి చేశారని పేర్కొన్నారు. పదవీ విరమణ సందర్భంగా విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయశీలో సోమవారం జరిగిన వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన చక్రధర్ బాబు మాట్లాడుతూ..మహిళలు ఉద్యోగ రంగంలో రాణించేందుకు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, సహకారం ఎంతో అవసరమని పేర్కొంటూ సుబ్రమణ్యేశ్వరి కుటుంబ సభ్యులను కూడా అభినందించారు. ఉద్యోగపదవీ విరమణ ఉద్యోగ జీవితంలో సహజమైన ప్రక్రియ అయినప్పటికీ, సుబ్రమణ్యేశ్వరి సేవలను, సాన్నిహిత్యాన్ని డిపార్ట్‌మెంట్ తప్పక మిస్ అవుతుందని సహచర అధికారులు పేర్కొంటూ, ఆమెకు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాధుల నియంత్రణలో కంటైన్‌మెంట్, సర్వైలెన్స్, సమర్థవంతమైన చికిత్సా విధానాలు కీలకమని, ప్రజలు కూడా స్వీయ సంరక్షణతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. విధుల నిర్వహణలో సహకరిశీచిన అందరికీ సుబ్రమణ్యేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పద్మావతి, ఇతర రాష్ట్ర హెల్త్ డిపార్ట్మెంట్ ఉన్నతస్థాయి అధికారులు (ఎన్ హెచ్ ఎం) విజయలక్ష్మి, డి.ప్రకాష్ రావు, బీవీ రావు, అర్జునరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వృత్తి ప్రవృత్తిలకు సమ న్యాయం చేసిన వ్యక్తి డాక్టర్ ఎస్ వి ఆర్.



**విజయవాడ పశ్చిమ ఆగష్టు 31 (వార్త ప్రభ ప్రతినిధి)** తెలుగు భాష ఉపాధ్యాయులుగా, రంగస్థల నటులుగా విశిష్ట సేవలు అందించిన డాక్టర్ ఎస్ వెంకటేశ్వర రావును నేటి తరం ఉపాధ్యాయలు ఆదర్శంగా తీసుకోవలసిన అవసరం ఉందని ఎస్ కె పి వి వి హిందూ హైస్కూల్ కార్యదర్శి కే ఎల్ వి మోహన్ రావు కొనియాడారు. హిందూ హైస్కూల్లో సుమారు 32 సంవత్సరాల పాటు తెలుగు ఉపాధ్యాయునిగా సేవలందించిన డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ రావు పదవి విరమణ కార్యక్రమం సోమవారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించిన అనంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన మోహనరావు మాట్లాడుతూ 32 సంవత్సరాల సర్వీసులో 31 సంవత్సరాలు పబ్లిక్ పది పరీక్షల్లోవిద్యార్థులతో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించిన ఘనత ఆయనకే తక్కుతుందన్నారు. ఎస్.కె పి వివి హిందూ హైస్కూల్స్ కోశాధికారి డాక్టర్ గోళ్ళ బాబా విజయకుమార్ మాట్లాడుతూ తన 12 ఏటనే నాటక రంగ ప్రవేశం చేసి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నంది అవార్డును అందుకోవటం గొప్ప విషయం అన్నారు. నవరసాలు పండించగల ఉపాధ్యాయులు తమ విద్యాసంస్థలకు సొంతమన్నారు. కాబట్టే తమ విద్యాసంస్థలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి అన్నారు. కేబీఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ తూనికుంట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞాశాలి పదవీ విరమణ చేయటం బాధాకరమన్నారు. కమిటీ పరిపాలన విభాగాధిపతి డాక్టర్ వి నారాయణ రావు మాట్లాడుతూ పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు తనను తాను మార్చుకుంటూ పాఠశాల అభివృద్ధిలో, విద్యార్థులు తీర్చిదిద్దటంలో అందె వేసిన చెయ్యి వెంకటేశ్వరరావు అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ పాఠశాలలో ఎస్.వెంకటేశ్వరరావు విధులు నిర్వహించటం తమ అదృష్టం అన్నారు. ఈ కార్యక్రమంలో అమరావతి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొనకల్లా రెడ్డమ్మ, ఎంఎస్ఆర్ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ, పాఠశాల ఉపాధ్యాయులు బ్రహ్మేశ్వర రావు కార్యక్రమాన్ని నిర్వహించారు. జె ఆనంద్ కుమార్, శ్రీనివాసరావు, జి పురుషోత్తం, అరుణ కుమారి, కృష్ణ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

## సబ్ జైలు ను సందర్శించిన న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి ఎస్.వరలక్ష్మి



**నూజివీడు, ఆగస్టు31 :(వార్తా ప్రభ ప్రతినిధి):**ఉమ్మడి కృష్ణాజిల్లా రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి ఎస్ వరలక్ష్మి గారు నూజివీడు సబ్ జైలును సందర్శించారు. జైల్లో ఉన్న ఖైదీలను వారి యొక్క కేసుల వివరాలు గురించి, ఆరోగ్య సమస్యల గురించి మరియు వారికి జైలులో ఏమైనా సమస్యలు ఉన్నవా అని అడిగి తెలుసుకున్నారు. వారితోపాటు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి కే శ్రావణి గారు, సబ్ జైల్ సూపరిన్టెంట్ తదితరులు ఉన్నారు.

## కన్నుల పండువగా, శాస్త్రోక్తంగా గణపతి దేవుని ప్రాణ పతిష్ట





**విజయవాడ పశ్చిమ ఆగష్టు 31 :(వార్త ప్రభ ప్రతినిధి)**శ్రీశ్రీశ్రీ అష్టదళ గణపతి స్వామి వారి పూజా మందిరంలో సోమవారం ఉదయం గణపతి దేవుని కి శాస్త్రోక్తంగా ప్రాణపతిష్ట చేశారు. సి వి ఆర్ ఫ్లై ఓవర్ పక్కన వున్న పోతిన చిన్న నగర్ లోని విఘ్నేష్ హైట్స్ ప్రాంగణంలో అష్టదళ గణపతి స్వామి పూజా మందిరాన్ని ఇటీవల నిర్మించారు. ఐతే సంప్రదాయం ప్రకారం కళశ స్థాపన,గణపతి స్వామి,మూషికం, అభయాంజనేయ స్వామి, నాందేశ్వరుడు, విగ్రహాలకు ప్రాణ పతిష్ట చేశారు. తొలుత వేద మంత్రాలతో సామూహిక హోమం నిర్వహించారు. ఈ హోమం పూజలో జమ్ము శ్రీనిసరావు. శ్రీలక్ష్మి, గూడేల అనందు. అలేఖ్య, మూడ దుర్గా ప్రసాద్. భాగ్యలక్ష్మి, పైడిపాటి దుర్గారావు. జయలక్ష్మి, దంపతులు పాల్గొన్నారు. మందిరం నిర్మాణ కమిటీ సభ్యులు మధిపురి సత్యనారాయణ, విఘ్నేష్ హైట్స్ అసోసియేషన్ కార్యదర్శి కే వి లక్ష్మి నారాయణ, మాజీ అధ్యక్షులు కే కోటేశ్వరరావు, వేలూరి విమల, సిద్ధాంతి ప్రకాష్ తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొని పూజలు నిర్వహించారు.

## సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ మాసంలో వరసకార్యక్ర మాలు



**చెరుకుపల్లి మండలం ఆగష్టు 31 :(వార్త ప్రభ ప్రతినిధి)** సమరతసేవా పౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెల్లో జరగవలసిన కార్యక్రమాలు గురించి బాపట్ల జిల్లా కన్వీనర్ పొన్నపల్లి సత్యనారాయణ ఓ ప్రకటన లో వివరించారు. సెప్టెంబర్ 1 నుండి మండల సమావేశాలు తర్వాత గ్రామ ధార్మిక సమావేశాలు సత్సంగము ఏకాదశి నగర సంకీర్తన సామూహిక హారతి బాల వికాస్ కేంద్రాల పని పర్యవేక్షణ సెప్టెంబర్ నాలుగున శ్రీకృష్ణ జయంతి 11న పోలాల అమావాస్య 13న బలరామ జయంతి 14న వినాయక చవితి 17న విశ్వకర్మ జయంతి మరియు కార్యక్రమాలు జరుగుతాయి అని బాపట్ల జిల్లా సమరసత సేవ ఫౌండేషన్ కన్వీనర్ పొన్నపల్లి సత్యనారాయణ తెలియజేశారు.

## బద్లావ్ జరూరి హై ! బి.జె.పి హటావో దేశక్ బచావో మార్పు కావాలి!! మార్పు రావాలి !!"

## సెప్టెంబర్ 1న "చలో ఢిల్లీ"కి విజయవాడ నుండి బయలుదేరిన నగర సిపిఐ నాయకులు జి. కోటేశ్వరరావు.




**విజయవాడ పశ్చిమ ఆగష్టు 31 :(వార్త ప్రభ ప్రతినిధి)**సిపిఐ నాయకులు ఢిల్లీ బాట పట్టారు ఈ సందర్భంగా జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, నల్లధనం వెలికితీత,ధరల స్థిరీకరణ,ఎన్నికల వాగ్దానాలు అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు అయినా అమలు చేయడంలో ఘోరంగా విఫలమైన బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా పక్కకు నెట్టి కులం పేరుతో, మతం పేరుతో, ప్రాంతం పేరుతో భాష పేరుతో, వైషమ్య రాజకీ యాలకు పాల్పడుతుందని ఆరోపించారు. మహిళలను గౌరవిస్తాం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన నేతలు డీ లిమిటేషన్ ,మహిళా బిల్లుకు ముడిపెట్టి చట్టసభల్లో 33 .3శాతం రిజర్వేషన్ బిల్లు వీగిపోయేటట్లు చేశారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టెందుకు,దేశ సమగ్రత సమైక్యత కోసం ఆగస్టు 6 నుండి 15 వరకు ప్రచార పాదయాత్రలు,సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమం ద్వారా నిరంకుశ ప్రభుత్వ మెడలు వంచి దేశం కోసం జాతిని ఏకం చేసే కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున పార్టీ, ప్రజా సంఘాల నాయకులు భయలు దేరారని అన్నారు.

## విజయ సాధనే గురిగా

పయనించు లక్ష్యం వైపు
దానిపై ఉండని చూపు
ఎదురైనా అడ్డంకులు
మానవద్దు ప్రయత్నాలు
నిరంతర సాధనతో
నిర్మలమైన మనసుతో
సాగిపో మున్ముందుకు
సడలని పట్టుదలతో
అవకాశమే దొరకగా
ఆకాశమే హద్దుగా
చేయాలి సద్వినియోగము
చేరాలి విజయ తీరము
చూపరాదు పిరికితనము
వదలరాదు చురుకుదనము



ఏదైనా పొందువరకు
చరిత్రలో నిలిచేందుకు

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# వెలిగొండపై క్రెడిట్ కోసం తాపత్రయం!

- శంకుస్థాపనలు చేయడం తప్ప చేసిందేమీ లేదు ● వైఎస్సార్ హయాంలోనే పనులకు శ్రీకారం.. జగన్ హయాంలో పూర్తికి చేరువ
- ఇప్పుడు తానే పూర్తి చేసినట్లు ప్రచారం చేసుకోవడం విడ్డూరం ● మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ధ్వజం

**ఆత్మకూరు ఆగస్టు31 (వార్తాప్రభ ప్రతినిధి)** వెలిగొండ ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు క్రెడిట్ కోసం తాపత్రయపడుతున్నారని వైఎస్సార్సీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి విమర్శించారు. 1996లో ఒకసారి రెండేళ్ల తర్వాత మరోసారి శంకుస్థాపన చేసినా అనంతరం ప్రాజెక్టును పట్టించుకోలేదని ఆరోపించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జలయజ్ఞంలో భాగంగా ప్రాజెక్టు పనులు ప్రారంభమై వేగం పుంజుకున్నాయని.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పనులు అత్యధికంగా జరిగి ప్రాజెక్టు పూర్తికి చేరిందని తెలిపారు. ఆదివారం రాత్రి నెల్లూరులోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు చరిత్రను ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



**రెండుసార్లు శంకుస్థాపన.. ఫలితం శూన్యం** చంద్రబాబు 1996లో వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, రెండేళ్లకే మరోసారి శంకుస్థాపన చేశారని రాజమోహన్‌రెడ్డి తెలిపారు. శంకుస్థాపనల తర్వాత ప్రాజెక్టు నిర్మాణాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పుడు దశాబ్దాల తర్వాత ప్రాజెక్టును తానే పూర్తి చేసినట్లు చెప్పుకోవడం సరికాదన్నారు. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జలయజ్ఞంలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని తెలిపారు. ప్రకాశం నెల్లూరు కడప జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలకు సాగు తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రాజెక్టును చేపట్టారని చెప్పారు. శ్రీశైలం జలాశయం నుంచి సొరంగాల ద్వారా నీటిని తరలించేలా ప్రాజెక్టును రూపొందించారని వివరించారు. వైఎస్సార్ హయాంలో పనులు శరవేగంగా సాగాయని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు పూల సుబ్బయ్య పేరు పెట్టింది కూడా వైఎస్సారేనని గుర్తుచేశారు.

**జగన్ హయాంలో అత్యధిక పనులు** తదుపరి చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కొంతమేర పనులు జరిగినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ప్రాజెక్టు పనులు గణనీయంగా ముందుకు సాగాయని రాజమోహన్‌రెడ్డి తెలిపారు. మిషనరీ సమస్యలు ఎదురైనా ప్రత్యామ్నాయ మార్గాల్లో పనులు కొనసాగించి ప్రాజెక్టును పూర్తిచేసే దిశగా తీసుకెళ్లారని చెప్పారు.

**'నేనే చేశా' అంటే చరిత్ర మారదు** ప్రాజెక్టు నిర్మాణంలో ఎవరి హయాంలో ఎంత పని జరిగిందన్నది రికార్డుల్లో ఉంటుందని రాజమోహన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం మారిన వెంటనే పూర్తయిన ప్రాజెక్టులకు మొత్తం క్రెడిట్‌ను ప్రస్తుత ప్రభుత్వం తీసుకోవడం వల్ల వాస్తవాలు మారవన్నారు. 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేశానని చెప్పుకోవడం వేరు. ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ముందుకు తీసుకెళ్లడం వేరని పేర్కొన్నారు. పోలవరం వెలిగొండ సోమశిల హైలెవల్ కెనాల్ వంటి కీలక ప్రాజెక్టులకు వైఎస్సార్ హయాంలోనే పునాది పడిందన్నారు. సోమశిల హైలెవల్ కెనాల్‌ను 2009లోనే మేనిఫెస్టోలో ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. రైతుల పరిస్థితిపై ఆందోళనరెండు తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాజమోహన్‌రెడ్డి తెలిపారు. ముఖ్యంగా వరి సాగు చేస్తున్న రైతులు నీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రైతులకు అవసరమైన సహాయం అందించాలని కోరారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి

**చేజర్ల మండల జర్నలిస్టులతో కలిసి తహశీల్దారుకి వినతి పత్రం**
**ఏ.పి.ఎం.పి.ఎ నెల్లూరు జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి సురేష్**



**చేజర్ల ఆగస్టు 31 (వార్తాప్రభ)**చేజర్ల మండలంలో మరియు నెల్లూరు జిల్లాలోని ఎన్నో సంవత్సరాలుగా జర్నలిస్టులుగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడంలో తమ వంతు బాధ్యతను నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి సురేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులలో చాలామందికి సొంత ఇల్లు లేదా ఇంటి స్థలం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన జర్నలిస్టులను గుర్తించి వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని సానుకూలంగా పరిశీలించి జర్నలిస్టులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఏ.పి.ఎం.పి.ఎ) నెల్లూరు జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి సురేష్ చేజర్ల మండలం తోటి జర్నలిస్టులతో కలిసి చేజర్ల తహశీల్దారుకి వినమ్రంగా విజ్ఞప్తి చేయడం జరిగినది. ఈ విషయంపై చేజర్ల తహసీల్దారు సానుకూలంగా స్పందించడం జరిగినది.

## ఏలూరు ఎంపీ నూతన నివాసం, కార్యాలయం ప్రారంభం

- ఎంపీ నివాసంలో ఎమ్మెల్యేల ఆత్మీయ సమావేశం.
- హాజరైన ఏలూరు, దెందులూరు, కైకలూరు, చింతలపూడి ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు.
- . చెప్పినట్లుగానే ఏలూరులో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకున్న ఎంపీ. ● వట్లూరు సీతాపురం కాలనీలో ఎంపీ నూతన గృహం, కార్యాలయం.
- సోమవారం నుంచి కొత్త క్యాంపు కార్యాలయంలో పూర్తి స్థాయిలో కార్యక్రమాలు ప్రారంభించిన ఎంపీ.





**ఏలూరు,ఆగస్టు31 :(వార్తా ప్రభ ప్రతినిధి):** ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నివాసంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మరియు ముఖ్య నాయకులకు ఆదివారం సాయంత్రం ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లా ఎమ్మెల్యేలు, ఇంచార్జిలు ప్రతి నెల ఒక ప్రజా ప్రతినిధి నివాసంలో నిర్వహించే ఆత్మీయ సమావేశాల్లో భాగంగా ఆదివారం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నివాసంలో ప్రజాప్రతినిధులు సమావేశం అయ్యారు. వట్లూరు పంచాయతీ పరిధిలోని సీతాపురం కాలనీలో ఎంపీ ఇటీవల నిర్మించిన సొంత ఇంటిలో జరిగిన ఈ విందులో.. ఏలూరు ఎమ్మెల్యే మరియు జిల్లా టిడిపి అధ్యక్షుడు బడేటి చంటి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, అప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, కైకలూరు నియోజకవర్గం టిడిపి నేత, ఫైవ్ మాన్ కమిటీ సభ్యుడు కొడాలి వినోద్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఆత్మీయ విందు సందర్భంగా ఎంపీ నివాసానికి వచ్చిన ఎమ్మెల్యేలు, ఇతర అతిథులంతా కాసేపు ఇల్లంతా కలియతిరుగుతూ కబుర్లతో ఉల్లాసంగా గడిపారు. విందు ముగిసిన అనంతరం అతిథులకు వారి వాహనాల వద్దకు వచ్చి మరీ ఎంపీ స్వయంగా వీడ్కోలు పలికారు.

**కొత్త కార్యాలయంలో**..సీతాపురంలో నివాస భవనంతోపాటు పక్కనే నిర్మించిన క్యాంపు కార్యాలయం భవనంలో సోమవారం నుంచి పూర్తి స్థాయిలో కార్యక్రమాలు ప్రారంభించారు. సోమవారం ఎంపీ తన సిబ్బందితో సహ పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని ప్రజలు, కార్యకర్తల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. సోమవారం కొత్త కార్యాలయంకు వచ్చిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు ఎంపీకి నూతన గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, "ప్రజల ఆశీస్సులు, అభిమానమే తనకు ఎప్పటికీ గొప్ప బలం అని, ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తాను" అని తెలిపారు. సోమవారం నుంచి సీతాపురం 4 వ లైన్ లోని తన కొత్త కార్యాలయంలో ప్రజలకు, కార్యకర్తలకు, తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని ఎంపీ వెల్లడించారు.

## ఆత్మకూరు పట్టణ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ నూతన మేనేజర్ గా నియమితులైన అరవ రాజ



**ఆత్మకూరు ఆగస్టు 31 (వార్తాప్రభ)** తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో వివిధ శాఖలలో పని చేస్తూ చిత్తూరు జిల్లా పుంగనూరు నుండి ఆత్మకూరు పట్టణ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ నూతన మేనేజర్ గా అరవ.రాజ విధులలో చేరారు. బ్యాంక్ ఖాతాదారుల వివరాలను బ్యాంకులోని లోన్లు మరియు ఇతర కార్యక్రమాలకు సంబంధించి పూర్తి వివరాలను సంబంధిత సిబ్బందితో అడిగి తెలుసుకొని వారికి అనుగుణంగా ప్రజలతో సత్సబంధాలు కొనసాగిస్తూ విధులు నిర్వహిస్తానని ప్రభుత్వ సూచించిన విధంగా ప్రభుత్వ పథకాలను తమ బ్యాంకు నుండి అందించడంలోనూ బ్యాంక్ కొత్త ఖాతాలను పెంచి బ్యాంకు ప్రయోజనాల గురించి ప్రజలకు వివరిస్తూ తమ బ్యాంకు నుండి ఖాతాదారులకు మరింతగా సేవలు చేస్తుందని ప్రజలు తమ బ్యాంకు సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.

## కృష్ణా జిల్లాలోని అన్ని ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల్లో యూత్ రెడ్ క్రాస్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

**యువతలో సేవాభావం, రక్తదానం, విపత్తుల నిర్వహణపై అవగాహన పెంపొందించాలి**
**-జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**



**మచిలీపట్నం ఆగస్టు31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ సూచనల మేరకు కృష్ణా జిల్లాలోని అన్ని ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల్లో యూత్ రెడ్ క్రాస్ యూనిట్లను ఏర్పాటు చేసి, విద్యార్థులను సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి కళాశాలల యాజమాన్యాలకు, ప్రిన్సిపాళ్లకు సూచించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ నుంచి కృష్ణా యూనివర్సిటీ, జేఎన్టీయూ వైస్‌చాన్సలర్లు, జిల్లాలోని ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రతి కళాశాలలో యూత్ రెడ్ క్రాస్ యూనిట్ ఏర్పాటు, విద్యార్థుల నమోదు, నిర్వహించాల్సిన సేవా కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. యూత్ రెడ్ క్రాస్ ద్వారా విద్యార్థుల్లో మానవతా దృక్పథం, సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి కళాశాలలో యూనిట్లను చురుకుగా నిర్వహిస్తూ, ఎక్కువ సంఖ్యలో విద్యార్థులను వాలంటీర్లుగా నమోదు చేయాలని తెలిపారు. విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతో పాటు, రక్తదానం ప్రాముఖ్యతపై ఇతరుల్లో అవగాహన కల్పించి రక్తదాతలను ప్రోత్సహించాలని సూచించారు. అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండేలా యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వారికి తక్షణ సహాయం అందించేందుకు విద్యార్థులకు సీపీఆర్, ప్రథమ చికిత్స విధానాలపై అవగాహన, శిక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితులు సంభవించినప్పుడు సహాయక చర్యల్లో పాల్గొనే విధంగా యువతను సన్నద్ధం చేయాలని సూచించారు. యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువతలో అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అదే విధంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణా జిల్లా చైర్మన్ డాక్టర్ డి.ఆర్.కె. ప్రసాద్, జిల్లా సెక్రటరీ శ్రీ భవిరి శంకర్‌నాథ్‌లు యూత్ రెడ్ క్రాస్ యూనిట్ల ఏర్పాటు, వాలంటీర్ల నమోదు ప్రక్రియపై కళాశాలల ప్రతినిధులకు వివరించారు. ఏపీ రెడ్ క్రాస్ యాప్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేసుకునే విధానం, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్ల ద్వారా నిర్వహించగల వివిధ సేవా కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు.

## మచిలీపట్నంలో మదర్ ఫీడింగ్ రూముల ఏర్పాటు.

**ప్రజారోగ్య ప్రమాణాలపై మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఆకస్మిక తనిఖీలు**




**మచిలీపట్నం ఆగస్టు31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలకు మెరుగైన ప్రజారోగ్య సదుపాయాలు కల్పించడం, ముఖ్యంగా తల్లులు మరియు శిశువులకు అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచడం లక్ష్యంగా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అడపా సుబ్రహ్మణ్యం సోమవారం మచిలీపట్నం నగరంలోని పలు ముఖ్యమైన ప్రజా రద్దీ ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మచిలీపట్నం మెయిన్ బస్టాండ్ ఆవరణంలో ఏర్పాటు చేసిన ఫీడింగ్ రూమును పరిశీలించి, అక్కడ అందుబాటులో ఉన్న సదుపాయాలు, నిర్వహణ విధానం తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. తల్లులు తమ చిన్నారులకు సౌకర్యవంతంగా, పరిశుభ్రమైన వాతావరణంలో పాలిచ్చేందుకు ఇటువంటి మదర్ ఫీడింగ్ రూములు అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. అనంతరం రైల్వే స్టేషన్ పరిధి, పీవీఆర్ మల్టీప్లెక్స్ మాల్ పరిధి మరియు డి-మార్ట్ పరిధిలోని ప్రాంతాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ప్రజల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో తల్లులు, శిశువుల సౌకర్యార్థం తప్పనిసరిగా మదర్ ఫీడింగ్ రూములను ఏర్పాటు చేయాలని సంబంధిత యాజమాన్యాలు నిర్వాహకులకు సూచించారు. జనసంచారం అధికంగా ఉండే బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు ఇతర ముఖ్యమైన ప్రజా ప్రదేశాలలో పరిశుభ్రమైన, సురక్షితమైన సౌకర్యవంతమైన మదర్ ఫీడింగ్ రూముల ఏర్పాటు అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యటనలో భాగంగా మెయిన్ బస్టాండ్ ఆవరణంలోని క్యాంటీన్‌ను, పీవీఆర్ మల్టీప్లెక్స్‌లోని ఫుడ్ స్టాల్స్‌ను కూడా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ పరిశీలించారు. ప్రజారోగ్య దృష్ట్యా అక్కడ పాటిస్తున్న పారిశుధ్య ప్రమాణాలు, ఆహార పదార్థాల నిల్వ కోసం వినియోగిస్తున్న ఫ్రీజర్లు, ఆహార భద్రతకు సంబంధించిన ఫుడ్ లైసెన్సులు సంబంధిత ధృవపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన, పరిశుభ్రమైన సురక్షితమైన ఆహార పదార్థాలు అందించేందుకు ప్రతి ఆహార వ్యాపార సంస్థ తప్పనిసరిగా పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని, అవసరమైన లైసెన్సులు ధృవపత్రాలను సక్రమంగా నిర్వహించాలని ఈ సందర్భంగా సూచించారు. మచిలీపట్నం నగరంలో ప్రజారోగ్యం, పారిశుధ్యం తల్లీ--శిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, ప్రజా రద్దీ ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అడపా సుబ్రహ్మణ్యం , నగరపాలక సంస్థ కమీషనర్ చోడే వీర వెంకట సత్య బాపిరాజు తెలిపారు.

## పారిశుధ్య నిర్వహణలో ఆధునిక వాహనాలు, యంత్రాల వినియోగంతో మెరుగైన ఫలితాలు

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ ఆగష్టు 31 :(వార్త ప్రభ ప్రతినిధి)** పారిశుధ్య నిర్వహణలో ఆధునిక వాహనాలు, యంత్రాలను విస్తృతంగా వినియోగించడం ద్వారా మెరుగైన పారిశుధ్య సేవలు అందించడంతో పాటు పారిశుధ్య కార్మికులపై పని భారాన్ని తగ్గిస్తూ నగర పరిశుభ్రతను మరింత మెరుగుపరుస్తున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా బీఆర్‌టీఎస్ రోడ్, ఎర్రకట్ట రోడ్, కేటీ రోడ్, పాల ఫ్యాక్టరీ, జక్కంపూడి వైఎస్సార్ కాలనీ, వన్‌టౌన్ ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. పాల ఫ్యాక్టరీ వద్ద ఎక్స్‌కవేటర్ సహాయంతో తేలియాడే వ్యర్థాలను తొలగిస్తున్న పనులను కమిషనర్ పరిశీలించారు. నగరంలో పారిశుధ్య నిర్వహణలో భాగంగా రహదారుల శుభ్రత, కాలువల్లో పూడికతీత, వ్యర్థాల తొలగింపు తదితర పనులకు ఆధునిక వాహనాలు, యంత్రాలను వినియోగిస్తున్నామని తెలిపారు. రహదారులను శుభ్రం చేసేందుకు స్వీపింగ్ మెషిన్లు, కాలువల్లో పూడికతీతకు నాలా మ్యాన్, ఎక్స్‌కవేటర్లు, యూజీడీ సిల్టింగ్ మెషిన్లు, వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు మిస్ట్ వాహనాలు వంటి ఆధునిక పరికరాలను ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చి వినియోగిస్తున్నామని కమిషనర్ పేర్కొన్నారు. వీటి వినియోగంతో పారిశుధ్య పనులు మరింత వేగంగా, సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు కార్మికుల శ్రమను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆధునిక వాహనాలు, యంత్రాలను నిరంతరం వినియోగంలో ఉంచేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. ఏదైనా వాహనం లేదా యంత్రంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లయితే వెంటనే మరమ్మతులు నిర్వహించి, తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని అన్నారు. తద్వారా పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా సేవలు అందించేందుకు వీలవుతుందని తెలిపారు. అనంతరం వన్‌టౌన్‌లోని గాంధీ మహిళా కళాశాల సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. అన్న క్యాంటీన్‌కు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా క్యాంటీన్లను తనిఖీ చేయాలని సూచించారు. తనిఖీల సమయంలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ ఎన్. శ్రీనివాస్, డిసిపి చంద్రబోస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాస్, గోపాలకృష్ణమూర్తి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగుల హామీలు నెరవేర్చాలి..... ఏపీ జెఏసి కృష్ణాజిల్లా నాయకులు.



**మచిలీపట్నం ఆగస్టు31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని ఏపీ జేఏసీ అమరావతి కృష్ణాజిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా సోమవారం కృష్ణాజిల్లా కలెక్టర్‌కు ఉద్యమ నోటీసును అందజేశారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని, వేతన సవరణ ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఉద్యోగులపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే మధ్యంతర భృతిని మంజూరు చేయాలని నాయకులు కోరారు. వేతన సవరణ సంఘం కమిషనర్‌ను నియమించి పన్నెండవ వేతన సవరణ సంఘాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించడంతో పాటు, పెండింగ్ బకాయిల వివరాలను ఉద్యోగుల వేతన పట్టికల్లో నమోదు చేయాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు హామీ ఆధారిత అదనపు వేతన పెంపుదల, రెండు ఊహాత్మక వార్షిక వేతన పెంపుదలలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు గతంలో మాదిరిగానే అదనపు పింఛను మొత్తాన్ని పది శాతం, పదిహేను శాతం చొప్పున అందించాలని, ఒప్పంద ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించాలని కోరారు. బాహ్య సేవా ఉద్యోగులకు మానవ వనరుల విధానాన్ని అమలు చేసి ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఏపీ జేఏసీ అమరావతి నిజాయితీగా పోరాటం చేస్తోందని, సంఘం ప్రకటించిన ఉద్యమ కార్యాచరణను ప్రతి ఉద్యోగి పాటించి విజయవంతం చేయాలని కృష్ణాజిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కోశాధికారి నాగేశ్వరరావు, జిల్లా చైర్మన్ ఎం. శ్యామ్‌నాథ్, కార్యదర్శి వై.వి. రావు, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు పేపేటి సత్యనారాయణ, ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి. గోపిచంద్, మున్సిపల్ ఉద్యోగుల రాష్ట్ర నాయకులు గోపాల్‌తో పాటు ఏపీ జేఏసీ అమరావతి అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి పై మూలాలపై పోలీస్ నిఘా

**డ్రోన్ సాయంతో అనుమానిత ప్రాంతాల్లో పర్యవేక్షణ**
**గంజాయి బ్యాచ్ గుర్తింపునకు ప్రత్యేక చర్యలు**
**సమాచారం ఇస్తే రూ.5 వేల బహుమతి**
**ఇబ్రహీంపట్నం సీఐ సుబ్రహ్మణ్యం**



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 31(వార్తా ప్రభ ప్రతినిధి)** :గంజాయి మూలాలపై ఇబ్రహీంపట్నం పోలీసులు నిఘా పెంచారు. గంజాయి వినియోగం, విక్రయాలను అరికట్టేందుకు ఇబ్రహీంపట్నం సీఐ ఎ. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. రింగ్ సెంటర్ పరిసర ప్రాంతాలు, కొండపల్లి బ్యాంక్ సెంటర్ ప్రాంతాల్లో డ్రోన్ సాయంతో జల్లెడ పట్టారు. తమ సమాచార నిఘా వ్యవస్థలో లేని గంజాయి వినియోగదారుల గురించి సమాచారం అందించి వారిని పట్టిస్తే రూ. 1,500 నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. గంజాయి విక్రయించే వారి సమాచారం అందించిన వారికి రూ. 5 వేల నగదు బహుమతి ఇస్తామని పేర్కొన్నారు. మద్యం సేవించే వారిని గంజాయి వినియోగదారులుగా పరిగణించవద్దని ప్రజలు, యువతకు పోలీసులు అవగాహన కల్పించారు. గంజాయి వినియోగం వల్ల కలిగే నష్టాలు, దుష్ప్రభావాలను వివరించారు. గంజాయి నిర్మూలనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయంటూ వచ్చే వదంతులను నమ్మవద్దని సూచించారు. అదే విధంగా ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సత్యవతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ముసునూరు మండలం ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ కమిటీల ఎన్నిక



**ముసునూరు, ఆగస్టు31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ముసునూరు మండలం చింతలవల్లి గ్రామంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ మండల కమిటీల నిర్మాణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముసునూరు మండలం ఇన్‌చార్జి అధ్యక్షుడు దుబ్బాకు దేవరాజు మాదిగ అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా ఏలూరు జిల్లా ఎంఎస్‌పీ ఉపాధ్యక్షులు ముళ్ళపూడి వెంకటేశ్వరరావు మాదిగ పాల్గొన్నారు. ఎంఆర్‌పీఎస్ బలోపేతం, మంద కృష్ణ మాదిగ చేపట్టిన పోరాటాలు, ఎంఆర్‌పీఎస్ సాధించిన విజయాలు, భవిష్యత్ పోరాటాలు, విద్య ప్రాధాన్యతపై నాయకులు వివరించారు.అనంతరం ముసునూరు మండలానికి నూతన ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ కమిటీలను ఎన్నుకున్నారు.ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షులు: మద్దాల బాబురావు మాదిగఎంఎస్‌పీ మండల అధ్యక్షులు: దువ్వూరి లక్ష్మణరావు మాదిగఎంఆర్‌పీఎస్ ఉపాధ్యక్షులు: ముళ్ళపూడి రాము మాదిగ, గొల్లపల్లి ప్రసన్నకుమార్ మాదిగఎంఎస్‌పీ ఉపాధ్యక్షులు: మద్దాల మురళి మాదిగ, మేడూరి రవి మాదిగ, కుమ్ముకూరి రాంబాబు మాదిగ, సోంగా అంజయ్య మాదిగఎంఆర్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి: పల్లిపాము సతీష్ మాదిగఎంఎస్‌పీ ప్రధాన కార్యదర్శి: గండిపూడి బాబురావు మాదిగఅధికార ప్రతినిధులు: పల్లి శివరామ్ మాదిగ, పొదిల రాంబాబు మాదిగప్రచార కార్యదర్శి: సోదిమెళ్ళ సాయి చందు మాదిగకోశాధికారులు: ముళ్ళపూడి సజయ్ మాదిగ, కంకట వెంకటరత్నం మాదిగకార్యవర్గ సభ్యులుగా లక్కపాము సుధాకర్ మాదిగ, కొడవలి సతీష్ మాదిగ, తేనేటి రమేష్ మాదిగ, గొడవర్తి రవి మాదిగ, ముదునూరి శేషగిరి మాదిగ, కుమ్ముకూరు రాజా మాదిగ, పల్లిపాము చిట్టిబాబు మాదిగ, పల్లి కిషోర్ బాబు మాదిగ ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నూజివీడు నియోజకవర్గం ఇన్‌చార్జి దుబ్బాకు దేవరాజు మాదిగ, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు కలపాల విలియమ్స్ మాదిగ, ముసునూరు మండల మాజీ అధ్యక్షులు పల్లి కనకయ్య మాదిగ, ప్రధాన కార్యదర్శి డోలా ఆనంద్ మాదిగ, పల్లిపాము కుటుంబరావు మాదిగ, చింతలవల్లి గ్రామ మాజీ సర్పంచ్ పల్లిపాము జీవరత్నం మాదిగతో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# సీఎం నిర్ణయాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: సీఎస్ సంజయ్ జాజు

## సీఎం డ్యాష్‌బోర్డ్, ప్రజావాణి పనితీరుపై సమీక్ష



**హైదరాబాద్ ఆగస్టు31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**: ముఖ్యమంత్రి వివిధ శాఖల సమీక్ష సమావేశాల్లో ఇచ్చిన ఆదేశాలు, తీసుకున్న నిర్ణయాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం సీనియర్ అధికారులతో సమావేశమైన ఆయన.. వివిధ శాఖల వారీగా అమలు నివేదికలను సమీక్షించారు.సీఎం సమీక్ష సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలపై శాఖలు సమగ్రంగా, తాజా సమాచారంతో కూడినఎటిఆర్ ను సమర్పించాలని సీఎస్ సూచించారు. తీసుకున్న చర్యలు, సాధించిన పురోగతి, పెండింగ్‌లో ఉన్న సమస్యలు, వాటి పరిష్కారానికి నిర్దేశించిన గడువులను నివేదికల్లో స్పష్టంగా పొందుపరచాలని అన్నారు. కేవలం నిర్ణయాలను నమోదు చేయడానికేఎటిఆర్ లు పరిమితం కాకుండా.. వాటి అమలు, ఫలితాలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ఉపయోగపడాలని స్పష్టం చేశారు.

**సీఎం డ్యాష్‌బోర్డ్‌ను మరింత బలోపేతం చేయాలి**ముఖ్యమంత్రి డ్యాష్‌బోర్డ్ పనితీరును కూడా సంజయ్ జాజు సమీక్షించారు. ప్రభుత్వ కీలక కార్యక్రమాలు, ప్రాధాన్యతా ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించేందుకు డ్యాష్‌బోర్డ్‌ను మరింత సమర్థవంతమైన సాధనంగా తీర్చిదిద్దాలని సూచించారు.డ్యాష్‌బోర్డ్‌లో శాఖలు నమోదు చేసే సమాచారం ఖచ్చితమైనది, తాజాది, క్రమం తప్పకుండా నవీకరించబడినదిగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల అమలులో జాప్యాలను గుర్తించడం, సమస్యలను పరిష్కరించడం, ప్రధాన పథకాల పురోగతిని అంచనా వేయడంలో డ్యాష్‌బోర్డ్‌ను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.

**ప్రజావాణిపై ప్రత్యేక పర్యవేక్షణ** ప్రభుత్వ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ప్రజావాణి పనితీరును కూడా సీఎస్ సమీక్షించారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారం ప్రజా కేంద్రితంగా, ఫలితాల ఆధారంగా ఉండాలని ఆయన అన్నారు.ఫిర్యాదుల పరిష్కారాన్ని శాఖలు నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు సరైన సమాధానాలను సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు. పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు పదేపదే వస్తున్న సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారాలు కనుగొనేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**శాఖల మధ్య సమన్వయం కీలకం**వివిధ శాఖల మధ్య సమన్వయం అవసరమైన అంశాలను కూడా సీఎస్ సమీక్షించారు. ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడానికి శాఖల మధ్య మెరుగైన సమన్వయం అత్యంత అవసరమని అన్నారు.అధికారులు పరస్పరం సమాచారాన్ని పంచుకుంటూ, అంతర్‌శాఖల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు.ముఖ్యమంత్రి సమీక్ష సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు పర్యవేక్షణ, సీఎం డ్యాష్‌బోర్డ్ బలోపేతం, ప్రజావాణి ద్వారా సమర్థవంతమైన ఫిర్యాదుల పరిష్కారం ప్రధాన ప్రాధాన్యతలుగా ఉండాలని సీనియర్ అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు.జవాబుదారీతనం, సకాలంలో అమలు, సమర్థవంతమైన పర్యవేక్షణ, శాఖల మధ్య సమన్వయం పరిపాలనలో కీలక అంశాలుగా ఉండాలని, ప్రభుత్వ కార్యక్రమాలు, సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించడమే అంతిమ లక్ష్యమని సంజయ్ జాజు స్పష్టం చేశారు.స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేశ్ రంజన్, వికాస్ రాజ్, బీఎన్‌డీ ఎక్కా, నవీన్ మిట్టల్, దానకిశోర్ తదితర శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# ఆత్మకూరు నూతన డిఎస్పి గా నేడు విధులలో చేరిన టీ.వెంకటేశ్వర్లు



**ఆత్మకూరు ఆగస్టు 31 (వార్తాప్రభ ప్రతినిధి)** ఆత్మకూరు నూతన డీఎస్పీగా టి.వెంకటేశులు నేడు బాధ్యతలుస్వీకరించారు..పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మీడియా మిత్రులతో మాట్లాడుతూ, ఆత్మకూరు సబ్-డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అదేవిధంగా పేకాట, జూదం, బెట్టింగ్, కోడి పందాలు మట్కా తదితర అసాంఘిక మరియు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.మహిళలు మరియు చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని, వారిపై ఎవరైనా దాడులు, వేధింపులు లేదా ఇతర అఘాయిత్యాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన సందర్భాల్లో సంబంధిత నిబంధనల ప్రకారం హిస్టరీ సెక్సువల్ షీట్లు తెరవడం వంటి చర్యలు కూడా చేపడతామని పేర్కొన్నారు. అలాగే ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు, వినతులు మరియు సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి దాని స్వభావాన్ని బట్టి వెంటనే విచారణ చేపట్టి, చట్టపరంగా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తామని పేర్కొన్నారు.ప్రజలు తమ సమస్యలను ఎలాంటి భయం లేకుండా పోలీసుల దృష్టికి తీసుకురావచ్చని ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత వేగం మరియు బాధ్యతాయుతమైన స్పందన ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు సైబర్ మోసాలు ఆన్‌లైన్ ఆర్థిక నేరాలు అనుమానాస్పద లింకులు ఓటిపిలు మరియు వ్యక్తిగత సమాచార పరిరక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. సబ్-డివిజన్ పరిధిలోని ప్రాంతాలను స్వయంగా క్షేత్రస్థాయిలో సందర్శించి స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి సంబంధిత శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు మరియు ప్రజల సహాయ సహకారాలతో వాటికి శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రత్యేకంగా ఆత్మకూరు పట్టణంలో తరచుగా ఏర్పడుతున్న ట్రాఫిక్ జామ్ సమస్య పరిష్కారంపై దృష్టి సారిస్తామని పోలీసు మున్సిపల్ రెవెన్యూ మరియు ఇతర సంబంధిత శాఖల సమన్వయంతో పాటు వ్యాపారులు, వాహనదారులు మరియు ప్రజల సహకారంతో ట్రాఫిక్‌నుక్రమబద్ధీకరించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.ఆత్మకూరు సబ్ డివిజన్‌లో శాంతి భద్రతలు, నేర నియంత్రణ మహిళలు చిన్నారుల భద్రత ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారం సైబర్ నేరాల నివారణ ట్రాఫిక్ నియంత్రణ మరియు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొంటూ ఇందుకు సబ్-డివిజన్ పరిధిలోని ప్రజలు ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు మీడియా మిత్రులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని నూతన డీఎస్పీ టి.వెంకటేశులు కోరారు.

# జిల్లా స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

- స్వర్ణకారుల సంక్షేమం, ఐక్యత కోసం సమష్టిగా కృషి చేస్తాం: జిల్లా నాయకులు
- బ్రహ్మంగారి గుట్ట వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహణ





**మేడ్చల్--మల్కాజ్‌గిరి, ఆగస్టు 31, (వార్తాప్రభ)** : మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా స్వర్ణకార సంఘం నూతన జిల్లా కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం జీడిమెట్ల గ్రామం, బ్రహ్మంగారి గుట్ట సమీపంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు విజయమూడి రాఘవాచారి ముఖ్య అతిథిగా హాజరై నూతన జిల్లా కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అఖిల భారత సీసీ సభ్యుడు కీసరి శ్రీకాంత్ చారి మరియు ఇతర నాయకులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. జిల్లాలోని స్వర్ణకారులందరినీ ఐక్యంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు, స్వర్ణకారుల వృత్తి అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి అవకాశాలు మరియు సామాజిక భద్రత కోసం కృషి చేస్తామని తెలిపారు. స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రభుత్వ అధికారులు మరియు ప్రజాప్రతినిధుల సహకారంతో కృషి చేస్తామని పేర్కొన్నారు. సంఘం బలోపేతమే ప్రధాన లక్ష్యమని, స్వర్ణకారుల ఐక్యతే బలమని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. జిల్లాలోని అన్ని మండల సంఘాలను సమన్వయం చేసుకుంటూ ప్రతి స్వర్ణకార కుటుంబానికి సంఘం అండగా నిలిచేలా కార్యక్రమాలను చేపడతామని అన్నారు. జిల్లా అధ్యక్షుడు బావోజి పండరీచారి మాట్లాడుతూ నూతన కార్యవర్గ సభ్యులందరూ బాధ్యతతో పనిచేసి జిల్లాలోని స్వర్ణకారుల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసి, స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, స్వర్ణకార సంఘం నాయకులు, సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో స్వర్ణకారులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు రాష్ట్ర, జిల్లా, మండల సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలియజేసి భవిష్యత్తులో సంఘం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

# ఫ్లెక్సీల ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**- చిలుకూరి రామ్ కుమార్**



**రౌతులపూడి వార్తా ప్రభ 31 ఆగస్టు 26** రౌతులపూడి మండలం బిజెపి కార్యాలయంలో బిజెపి సీనియర్ నాయకులు రామ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పూర్తిగా ధ్వంసం చేసినట్టు స్థానికులు చెబుతున్నారు.ఈ విషయంపై రామ్ కుమార్ ఆయన స్పందిస్తూ గత 12 సంవత్సరాలుగా ప్రత్తిపాడు నియోజకవర్గ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలతో పాటు అనేక ప్రజా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నాను. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి నా వంతు కృషి చేస్తున్నాను.తన పుట్టినరోజు సందర్భంగా రౌతులపూడి మండలంలోని బీజేపీ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయంలో పూర్తిగా చింపివేయడం జరిగింది. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాము., ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, 'జనతా వారధి' కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అనే విషయాలను తెలుసుకుని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాము. అదేవిధంగా గిరిజన ప్రాంతాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాము.ఇటీవల గిరిజన సమస్యలను తెలుసుకునేందుకు ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి నియోజకవర్గానికి రావడం, గిరిజన ప్రాంతాల్లో పర్యటన చేసిన దగ్గర నుండి కొంతమంది కూటమిలో పనిచేస్తున్న టిడిపి వ్యక్తుల్లో ఏర్పడిన అక్కసుతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారనే అనుమానం కలుగుతోంది . ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన వ్యక్తులు ఎవరో పోలీసులు సమగ్రంగా విచారణ జరిపి, నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.ఈ ఘటనపై సంబంధిత డీఎస్పీ దృష్టికి, స్థానిక పోలీసు స్టేషన్ దృష్టికి తీసుకెళ్లి అధికారికంగా ఫిర్యాదు చేయడం జరుగుతుంది. అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్తాము. ఓ ప్రకటనలో తెలిపారు.ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రా యాలు సహజం. ఫ్లెక్సీలను ధ్వంసం చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు.ఈ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము. ఇది ఎలా ఉంటే కోటమీ ప్రభుత్వంలో బిజెపి పక్షాన పని చేస్తున్నటువంటి కార్యకర్తలు ఆందోళన నెలకొంది ఇటువంటి వలన ప్రజా సంక్షేమానికి గండి ఏర్పడుతుందని తెలిపారు ఆయా గ్రామ బిజెపి కార్యకర్తలు మనోభావాలు దెబ్బతినేలా ఈ కూటమీ ప్రభుత్వం ఏర్పడుతుందని ఊహించలేదా నీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇది ఎలా ఉంటే రాబోయే రోజుల్లో కూటమి పోయి వైఎస్ఆర్పిలో కలవడమే మేలని పలువురు ఆరోపిస్తున్నారు. కూటమి పక్షం ఏర్పడిన మాకు ఇటువంటి గతి పడుతుందని ఏనాడు ఊహించలేదని ఆయా గ్రామ బిజెపి కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు చిలుకూరి రాంకుమార్ బీజేపీ కాకీనాడ జిల్లా మాజీ అధ్యక్షుడు , ఏలూరు జిల్లా ఇంఛార్జి బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంగిరెద్దుల కులసంఘం వారి సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా

**-విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ**

**తెంపల్లి లో సంచార జాతుల విముక్తి దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ**



**గన్నవరం ఆగస్టు31 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గంగిరెద్దుల కులస్తుల సమస్యలను శాసనసభ వేదికగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హామీ ఇచ్చారు. గన్నవరం మండలం తెంపల్లె గ్రామంలో గంగిరెద్దుల కుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సంచార జాతుల విముక్తి దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డప్పు వాయిద్యాలు, గంగిరెద్దుల ప్రదర్శనలతో ఆయనకు ఘన స్వాగతం పలికిన కుల సభ్యులు అనంతరం కమ్యూనిటీ హాల్ వద్ద సంఘం జెండాను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ గంగిరెద్దుల కళ గ్రామీణ సంస్కృతికి, తెలుగువారి సంప్రదాయాలకు ప్రతీక అని చెప్పారు. చిన్నతనంలో తెంపల్లెకు వచ్చిన గంగిరెద్దుల ఆటలను చూసేవాడినని గుర్తు చేసుకున్నారు. మహానంది ఎడ్ల పందేలతో తమ కుటుంబానికి దశాబ్దాల అనుబంధం ఉందన్నారు. గంగిరెద్దుల కులాన్ని గుర్తించి వారి అభివృద్ధికి అడుగులు వేసిన తొలి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడేనని పేర్కొన్నారు. 2016లో జీవో నంబర్ 17 ద్వారా సంచార జాతులతో పాటు 32 కులాలను ఎంబీసీ పరిధిలోకి తీసుకొచ్చి గుర్తింపు కల్పించారని చెప్పారు. ఇటీవల అసెంబ్లీలో బీసీలకు 34 శాతం రాజకీయ రిజర్వేషన్ల బిల్లుపై చర్చ సందర్భంగా స్థిర నివాసం లేని గంగిరెద్దుల కుటుంబాలను ఆదుకుంటామని ముఖ్యమంత్రి ప్రకటించిన విషయాన్ని ప్రస్తావించారు. గంగిరెద్దుల వారి పిల్లలకు మెరుగైన విద్యావకాశాలు, కుటుంబాలకు భద్రత, కళాకారులకు గౌరవం, శ్రమకు తగిన గుర్తింపు కల్పించడం ప్రత్యేక హక్కులు కాదని, వారి జీవనానికి అవసరమైన న్యాయమైన హక్కులని అన్నారు. గంగిరెద్దుల కులస్తులు కోరుతున్న ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, పాఠశాలలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక సీట్ల కేటాయింపు, సబ్సిడీ రుణాలను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంపు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఎంబీసీ కింద కుల ధ్రువీకరణ పత్రాల జారీ, కళాకారులకు పెన్షన్ల మంజూరు వంటి డిమాండ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తాను ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చే నాయకుడిని కాదని, ప్రజల మధ్యే ఉంటూ పనిచేస్తానని చెప్పారు.

# ఘనంగా బెవర వారి వివాహా రిసెప్షన్ వేడుకలు.



**విజయవాడ పశ్చిమ ఆగష్టు 31 :(వార్త ప్రభ ప్రతినిధి)** టీడీపీ నేత,నగరాల సంఘం నాయకులు బెవర శ్రీహరి, లావణ్య దంపతుల కుమారుడు బెవర శివ సాయి కృష్ణ తేజేష్, హరిక లక్ష్మి ల వివాహ రిసెప్షన్ వేడుక చిట్టినగర్ నగరాల కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది.. ఈ వేడుకలో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.. వారి వైవాహిక జీవితం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయ అధ్యక్షుడు పోతిన భేసు కంటేశ్వరుడు,నగరాల కార్పొరేషన్ డైరెక్టర్లు సుకాసి కిరణ్, బెవర సాయి సుధాకర్, టీడీపీ నేత సారిపల్లి రాధ కృష్ణ, నగరాల సంఘం నాయకులు గుజ్జారీ అమర్, బెవర జోగేశ్వరరావు, బెవర మురళి, బెవర సూర్య నారాయణ నగరాల సంఘం నేతలు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కొత్త జంటను ఆశీర్వదించారు..

# అంగన్‌వాడీ టీచర్ సువర్చల సేవలు ప్రశంసనీయం

**- ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య.....**





**పెనుగంచిప్రోలు - ఆగస్టు 31( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు గ్రామంలోని హరి గార్డెన్స్ నందు సోమవారం నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్ సువర్చల పదవీ విరమణ అభినందన కార్యక్రమానికి జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్‌గా సువర్చల ఎన్నో సంవత్సరాలుగా చిన్నారుల సంరక్షణ, విద్యాబోధన, పోషణలో అంకితభావంతో సేవలందించడం అభినందనీయమని అన్నారు. చిన్నారుల భవిష్యత్తుకు పునాది వేసే బాధ్యతాయుతమైన సేవలో భాగస్వాములైన అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న కృషి ఎంతో విలువైనదని పేర్కొన్నారు.సువర్చల సేవలను అభినందిస్తూ, పదవీ విరమణ అనంతరం ఆమె ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని ఎమ్మెల్యే తాతయ్య ఆకాంక్షించారు. ఎన్నో తరాల చిన్నారుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఆమె అందించిన సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి దేవస్థానం మాజీ చైర్మన్ వాసిరెడ్డి బెనర్జీ, మాజీ జెడ్ పి టీ సి గజ్జి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ జిల్లెపల్లి సుధీర్ బాబు, ఎస్ సి సెల్ నాయకులు ముండ్లపాటి ప్రసాద్ మాస్టర్, లగడపాటి ప్రవీణ్,నల్లపునేని కొండ ,తెలుగుదేశం యువ నాయకులు మాదినేని వెంకట్రావు, అంగన్‌వాడీ సిబ్బంది, కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కృష్ణాష్టమి వేడుకలకు సర్వం సిద్ధం

**శ్రీశ్రీశ్రీ భక్తి సుందర్ దామోదర్ మహారాజ్ కమిటీ**



**విస్సన్నపేట ఆగస్టు31 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్థానిక శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో ఒకటవ తేదీ మంగళవారం నుండి ఏడవ తేదీ సోమవారం వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగేందుకు సర్వం సిద్ధం చేసినట్లు శ్రీశ్రీశ్రీ భక్తి సుందర్ దామోదర్ మహారాజ్ కమిటీ సభ్యులు మీడియా సమావేశంలో తెలియజేశారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు దేవాది దేవుడు లోక పాలకుడైన శ్రీకృష్ణ పరంధామని పూజా కార్యక్రమాలు మరియు లింగాభిషేకములు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులకు ఆవు పాలు కమిటీ అందిస్తుందన్నారు. నాలుగవ తేదీ శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉదయం 8 గంటల నుండి పది సంవత్సరాలు నిండిన పిల్లలకు శ్రీకృష్ణుని వేషధారణ అలంకరించి గీతా గోవిందుని వేదిక వద్ద ప్రదర్శించిన వారికి ఆకర్షణమైన బహుమతులు అందిస్తామన్నారు. అదే రోజు సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొని గెలుపొందిన విజేతలకు బహుమతులు ఇవ్వడం జరుగుతుందని కమిటీ సభ్యులు వివరించారు. మరిన్ని వివరాలకు టీ జయసింహ, ఎం చిట్టిబాబు ఎన్ ప్రసాద్ కే శ్రీనివాసరావు కాశీ కిరణ్ పి శరత్ బాబు డి మురళీకృష్ణ సత్యనారాయణ ఏడుకొండలు తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మానవసేవే మాధవసేవ - వృద్ధాశ్రమంలో అన్నదానం, వస్త్రదానం



**గుడివాడ,ఆగస్టు 31 (వార్తాప్రభ) :** మానవసేవే మాధవసేవ అనే నినాదంతో శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరి కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో 2566వ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మారెడ్డి పవన్ కుమార్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా స్థానిక బేతవోలులోని శాంతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెదపారుపూడి ఎస్ఐ డి. సుభాషిని విచ్చేసి నూతన వస్త్రాలు, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గరపు తిరుపతయ్య, గుడివాడ టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లంకపల్లి లాజర్, యాదవ సంఘం నాయకులు జాజుల తాతారావు, టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు అవార్డులతో "విద్యావికాస్"కు అరుదైన గౌరవం

-అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం




**గుడివాడ,ఆగస్టు 31 (వార్తాప్రభ) :** విద్యారంగంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా విద్యావికాస్ విద్యా కుటుంబానికి నాలుగు ప్రతిష్ఠాత్మక అవార్డులు లభించిన సందర్భంగా ఆదివారం సన్మాన సభ నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ దివంగత ముప్పాళ్ల సుబ్బారావు (ఎంఎస్ఆర్)కి Exemplary Contribution in Changing Education System అవార్డు, వెల్లంకి రేష్మా చౌదరికి బాల్య విద్యారంగంలో 16 ఏళ్ల సేవలకు Outstanding Contribution in Early Childhood Education అవార్డు లభించాయి. ఆమె ఆధ్వర్యంలోని హైదరాబాద్ RACYKIDS ప్లే స్కూల్స్ Top 10 Promising Play Schools in Hyderabad గా, గుడివాడ VIDYAVIKAS School ఉత్తమ ఫలితాలు, అకడమిక్ ప్రమాణాలకు గాను Excellence in Academics అవార్డుగా ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా ఎంఎస్ఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. సన్మానం అందుకున్న రేష్మా చౌదరి మాట్లాడుతూ తండ్రి స్ఫూర్తే తనకు మార్గదర్శకమన్నారు. రిటైర్డ్ ఎంఈఓ పి.డి. ఆశీర్వాదం, సీనియర్ ఉపాధ్యాయులు జయలక్ష్మి, బి.సంపత్ కుమారి, ఎన్.పద్మజ తదితరులు మాట్లాడుతూ ఇది దశాబ్దాల కృషికి దక్కిన గౌరవమన్నారు. డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు మాట్లాడుతూ 1992లో ప్రారంభమైన విద్యావికాస్ లక్ష్యం నాణ్యమైన విద్య అందించడమేనని, ఈ అవార్డులు మరింత బాధ్యతను పెంచాయన్నారు.

## రోడ్ల ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలి కాపా శ్రీనివాసరావు డిమాండ్



**నూజివీడు,ఆగస్టు 31 (వార్తాప్రభ) :** నూజివీడు మున్సిపాలిటీలో రహదారుల ఆక్రమణలు,నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ టిడిపి సీనియర్ నాయకుడు రావిచర్ల గ్రామ మాజీ సర్పంచ్ కాపా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.నూజివీడు పట్టణంలోని సత్యనారాయణ థియేటర్ ఎదురుగా ఇటీవల సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేసిన మార్గంలో కొందరు మున్సిపల్ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని ఆయన ఆరోపించారు.రోడ్డుకు అవసరమైన సెట్‌బ్యాక్ వదలకుండా నిర్మాణాలు చేపట్టడం వల్ల భవిష్యత్‌లో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు.ఈ విషయంపై ఇప్పటికే మున్సిపల్ కమిషనర్,సిబ్బందికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.మున్సిపల్ నిబంధనలను కచ్చితంగా అమలు చేసి,రహదారులను ఆక్రమిస్తున్న నిర్మాణాలను తొలగించాలని కోరారు.నూజివీడు మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా ఉన్న సబ్ కలెక్టర్,మున్సిపల్ కమిషనర్ ఈ అంశంపై తక్షణం స్పందించాలని కాపా శ్రీనివాసరావు కోరారు.అధికారులు చర్యలు తీసుకోకపోతే కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తానని, ఆక్రమణల తొలగింపు వరకు పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

# తుమ్మలగుంట చెరువులో మట్టి మాఫియా..!

- చంద్రాల శివారు తుమ్మలగుంట చెరువు
- నుంచి యదేచ్ఛగా మట్టి అక్రమ రవాణా
- మట్టిని ఊరి సమీపంలో వెంచర్లు,మిల్లు నిర్మాణానికి మట్టి తరలింపు
- పట్టించుకోని,రెవిన్యూ,ఇరిగేషన్, మైనింగ్ శాఖ అధికారులు
- అక్రమార్కుల నుంచి తుమ్మలగుంట చెరువు ను కాపాడాలంటున్న గ్రామస్తులు







**మైలవరం(టి.గన్నవరం),ఆగస్టు 31 (వార్తాప్రభ) :** చంద్రాల గ్రామ శివారు టి.గన్నవరం గ్రామ రెవిన్యూ పరిధిలోని తుమ్మల గుంట చెరువులో ప్రభుత్వ అనుమతులు లేకుండా కొంతమంది అక్రమార్కులు గత కొన్ని రోజులుగా యధేచ్ఛగా మట్టిని తరలించి జేబులు నింపుకుంటున్నారు.చెరువులో అనుమతులు లేకుండా మట్టి తోలకాలు జరుగుతున్నాయని తెలిసినా ఇరిగేషన్ అధికారులు గానీ, రెవిన్యూ అధికారులు కాని అటువైపు కన్నెత్తి చూడటం లేదు.చెరువు నుంచి ఇంత పెద్ద ఎత్తున మట్టి తరలిస్తున్నా రెవిన్యూ, ఇరిగేషన్, మైనింగ్ అధికారులు ఏం చేస్తున్నారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.జే సీ బి లు పెట్టి ట్రాక్టర్ల ద్వారా ఇష్టాను సారంగా అక్రమంగా తుమ్మలగుంట చెరువు నుంచి మట్టి తరలిస్తూ చెరువును కొల్లగొడుతున్నారని గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు.ఈ తతంగం అంతా చంద్రాల గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు ఆధ్వర్యంలోనే మట్టి అక్రమ రవాణా జరుగుతుం దని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ప్రజలు కట్టే పన్నుల నుంచి జీతాలు తీసుకుంటున్న అధికారులు తమ విధులు సక్రమంగా నిర్వర్తించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ రాజకీయ పార్టీ నాయకుల చెప్పుచేత ల్లో పని చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తు న్నారు.మట్టిని తరలించడం

**ఎన్టీఆర్ జిల్లా,మైలవరం మండలంలోని చంద్రాల గ్రామ శివారు టి.గన్నవరం రెవిన్యూ పరిధిలోని తుమ్మలగుంట చెరువులో మట్టి మాఫియా పెట్రేగిపోతోంది.ఈ చెరువు మట్టి అక్రమార్కులకు బంగారు 'గని'గా మారింది. ఎలాంటి అనుమతులు లేకుండా ఇరిగేషన్ చెరువు నుంచి వందల క్యూబిక్ మీటర్ల మట్టిని అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు.గ్రామంలో పలుకుబడి ఉన్న అధికార పార్టీ నాయకుడి కనుసన్నల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా చెరువులో మట్టిని బొక్కేస్తున్నారు.మట్టిని ఊరి సమీపంలో వెంచర్లు,రైస్ మిల్లు నిర్మాణానికి మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.**

ద్వారా తుమ్మల గుంట చెరువులో తాడి చెట్టు సగం మేర పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి.దీంతో చెరువు ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.ఈ మట్టిని ఊరి సమీపంలో వెంచర్లు,రైస్ మిల్లు నిర్మాణానికి మట్టి తరలిస్తు న్నారని వారు వాపోతున్నారు.తుమ్మలగుంట చెరువులో ఇంత పెద్ద ఎత్తున మట్టి మాఫియా జరుగుతున్నా అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి చంద్రాల తుమ్మలగుంట చెరువులో జరుగుతున్న మట్టి మాఫియాను అరికట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



## ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో అగ్ని మాపక శాఖ కీలక పాత్ర..

నూతన అగ్నిమాపక వాహన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము..





**గుడివాడ,ఆగస్టు 31 (వార్తాప్రభ) :** గుడివాడ అగ్నిమాపక కేంద్రానికి నూతనంగా కేటాయించిన అగ్నిమాపక వాహన ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము విచ్చేసి నూతన వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం అగ్నిమాపక కేంద్రంలో అందుబాటులో ఉన్న పరికరాలు, వాహనాలు, అత్యవసర రక్షణ సామగ్రిని ఎమ్మెల్యే పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి వారి విధులు, కేంద్రం పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. నూతన వాహనం అందుబాటులోకి రావడంతో గుడివాడ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రమాదాలకు మరింత వేగంగా స్పందించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వీలవుతుందన్నారు. సిబ్బందికి ఏవైనా సమస్యలు, అవసరాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సిబ్బందికి అవసరమైన గమ్ బూట్లు, హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ జె ఆంజనేయులు, లీడింగ్ ఫైర్ మెన్ యోగానంద్, ఐఎఫ్ లు బివిడి ప్రసాద్, వైఎల్ కుమార్, గోవర్ధన్ రెడ్డి, కూటమి పార్టీల నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, పంద్రాజు సాంబశివరావు, వాసే మురళీ, చేకూరు జగన్మోహనరావు, పోలాసి ఉమా, బొంబాయి శ్రీను, పొట్లూరి కృష్ణారావు, కే సుబ్రమణ్యం, బ్రహ్మయ్య, కోడూరు ప్రభు, గడ్డం ప్రకాష్ దాస్ మరియు అగ్నిమాపక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుడివాడ విద్యారంగానికి అరుదైన గౌరవం

- వరల్డ్ ఎడ్యుకేషన్ కాన్క్లేవ్-2026లో మూడు సంస్థలకు ప్రతిష్ఠాత్మక అవార్డులు

**గుడివాడ,ఆగస్టు 31 (వార్తాప్రభ) :** విద్యారంగంలో విశేష సేవలకు గుర్తింపుగా గుడివాడకు చెందిన మూడు విద్యాసంస్థలు ప్రతిష్ఠాత్మక World Education Conclave Awards- 2026కు ఎంపికయ్యాయి. ఆగస్టు 30న హైదరాబాద్ లోని ది పార్క్ హోటల్ లో జరిగిన వేడుకలో ఈ పురస్కారాలు అందజేశారు.

**విద్యావికాస్‌కు Excellence in Academics :** 1992లో దివంగత ముప్పాళ్ల సుబ్బారావు, కొమ్మినేని సాంబశివరావు స్థాపించిన విద్యావికాస్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ మూడు దశాబ్దాలుగా నాణ్యమైన విద్యను అందిస్తోంది. గూజలో వరుసగా అత్యుత్తమ ఫలితాలు, EELL, Abacus వంటి ఆధునిక కార్యక్రమాలకు గుర్తింపుగా సంస్థకు Excellence in Academics అవార్డు లభించింది.

**వికాస్ రైన్‌బోకు వీశేర్ Inspiring School :** 1993లో పుట్టి రామచంద్ర శేఖర్, పుట్టి అరుణ దంపతులు స్థాపించిన వికాస్ రైన్‌బో ఇంగ్లీష్ మీడియం స్కూల్, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ఫీజులతో నాణ్యమైన విద్యను అందిస్తూ 10వ తరగతిలో 100% ఉత్తీర్ణత సాధిస్తోంది. ఈ సేవలకు గాను Most Inspiring School అవార్డు లభించింది.

**శుభోదయకు Outstanding Contribution in Rural Education :** 2004లో జనార్ధనపురంలో సజ్జ రాఘవయ్య, సజ్జ అనిల్ కుమార్ స్థాపించిన శుభోదయ ఇంగ్లీష్ & తెలుగు మీడియం స్కూల్, చుట్టుపక్కల 20 గ్రామాల విద్యార్థులకు డిజిటల్ తరగతులతో విద్యను అందిస్తోంది. గ్రామీణ విద్యాభివృద్ధికి చేస్తున్న కృషికి గాను సజ్జ అనిల్ కుమార్ దంపతులకు Outstanding Contribution in Rural Education Services అవార్డు లభించింది. ఒకే ప్రాంతం నుంచి మూడు సంస్థలకు జాతీయ స్థాయి గుర్తింపు రావడం గుడివాడ విద్యారంగానికి గర్వకారణంగా నిలిచింది.




## విశ్వభారతి స్కూల్ లో 'చైతన్యం' అవగాహన కార్యక్రమం

- విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన సీఐ శ్రీనివాస్..



**గుడివాడ,ఆగస్టు 31 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు, గుడివాడ డీఎస్పీ పి. శ్రీనివాస్ పర్యవేక్షణలో గుడివాడ వన్ టౌన్ సీఐ కె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం విశ్వభారతి స్కూల్ లో "చైతన్యం" అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రత, మహిళల భద్రత, పోక్సో చట్టం, బాల్య వివాహాల చట్టం, ర్యాగింగ్ చట్టం, గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల దుష్పరిణామాలు, సైబర్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112, సైబర్ మోసాల ఫిర్యాదులకు 1930, మాదకద్రవ్యాల సమాచారం కోసం 1972 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, పాస్ వర్డ్ లను ఇతరులతో పంచుకోరాదని, కుటుంబ సభ్యులను కూడా చైతన్యపరచాలని సీఐ శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు.

## ఆర్మీ అనుబంధ క్యాంపు లో ఎ.ఎన్.ఆర్ విద్యార్థినులు



**గుడివాడ,ఆగస్టు 31 (వార్తాప్రభ) :** స్థానిక అక్కినేని నాగేశ్వర రావు కళాశాల నుండి ఇద్దరు ఎన్. సి. సి క్యాడేట్స్ సికింద్రాబాద్ లో జరిగిన ఆర్మీ అనుబంధ క్యాంపులో పాల్గొనడం అభినందనీయం అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్ తెలియజేసారు. ఈ శిక్షణ శిబిరములో పాల్గొని డ్రిల్ మరియు వెపన్ ట్రైనింగ్, మిలిటరీ డిసిప్లిన్ కల్చరల్ లో 1. జె. నవీన, 2. ఎం. మానసలు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను 76 ఇన్ఫాంట్రీ బెటాలియన్ ఎన్.సి. సి, సికింద్రాబాద్ మెరిట్ సర్టిఫికెట్స్ ప్రదానం చేయడం జరిగింది. ఈ శిక్షణ శిబిరములో పాల్గొని తదుపరి క్యాంపులకు ఎంపిక అవడం అభినందనీయం అని కళాశాల పాలక వర్గ ప్రెసిడెంట్ ఎల్.ఆర్. కె ప్రసాద్ తెలియజేసారు. ఈ సందర్భముగా ఎన్.సి.సి. అధికారి లెఫ్ట్ నెంట్ ఎం.డి.సలీం క్యాడేట్స్ ను అభినందించారు.

# జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్ పై సీఆర్డీఏ కు తగిన ఆదేశాలు

- మంత్రివర్గ ఉపసంఘం ముందుకూ ప్రతిపాదన: సురేష్ కుమార్

**విజయవాడ,ఆగస్టు 31 (వార్తాప్రభ) :** అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌పై ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ప్రభుత్వం తరపున వెంటనే సీఆర్‌డీఏ కమిషనర్‌కు తగిన ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. అంతేకాకుండా జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించిన అంశాన్ని ప్రభుత్వంలో సంబంధిత మంత్రివర్గ ఉప సంఘం ముందుంచి తదుపరి చర్యలకు మార్గం సుగమం చేస్తామని స్పష్టం చేశారు. వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు సోమవారం సురేష్ కుమార్‌ను కలిసి, సుప్రీంకోర్టు మాజీ రిజిస్ట్రార్ జనరల్ నుంచి పొందిన న్యాయ నిపుణుల అభిప్రాయాన్ని సమర్పించారు. జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించిన న్యాయపరమైన, విధానపరమైన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సుప్రీంకోర్టు మాజీ రిజిస్ట్రార్ జనరల్ ఇచ్చిన లీగల్ ఒపీనియన్‌ను అనుసరించి సొసైటీ సభ్యులకు గృహ నిర్మాణం చేపట్టేందుకు ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు లేవని వివరించారు. సొసైటీ ప్రతినిధుల వాదనలను సావధానంగా విన్న ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ సానుకూలంగా స్పందించారు. ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన చర్యలు తీసుకుంటామని, సీఆర్‌డీఏ కమిషనర్‌కు వెంటనే ఈ విషయంపై మెమో పంపిస్తామని తెలిపారు. అనంతరం హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించిన ప్రతిపాదనను మంత్రివర్గ ఉప సంఘం ముందుంచి, ప్రభుత్వ స్థాయిలో అవసరమైన నిర్ణయాలు తీసుకునేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ప్రభుత్వం గతంలో జారీచేసిన జీఓ ఎంఎస్ నంబర్ 107 విధివిధానాలను స్పష్టం చేసిందని, దాని అమలుకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు ఐ అండ్ పీఆర్ కమిషనర్ విశ్వనాథన్ ను సైతం సంఘం ప్రతినిధులు కలిశారు. అమరావతి రాజధాని నిర్మాణంతో పాటు జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పెండింగ్ అంశాలను కూడా పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఈ సందర్భంగా విశ్వనాథన్ తెలిపారు. జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌పై సొసైటీ సమర్పించిన న్యాయపరమైన అభిప్రాయం స్పష్టంగా ఉందని, సంబంధిత శాఖలు, అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తామని చెప్పారు. లీగల్ ఒపీనియన్ పరంగా పరిశీలించినప్పుడు అమరావతిలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల రీత్యా గతంలో ప్రభుత్వం ఇచ్చిన జీఓ అమలుకు ఎటువంటి అడ్డంకి లేదని తెలిపారు. సుదీర్ఘకాలంగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌పై ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ , ఐపీఆర్ కమిషనర్ విశ్వనాథన్ స్పష్టమైన హామీ ఇవ్వడం పట్ల సొసైటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి సీఆర్‌డీఏ కమిషనర్‌కు మెమో పంపడం, అనంతరం మంత్రి వర్గ ఉప సంఘం ముందుకు అంశాన్ని తీసుకెళ్లే ప్రక్రియ ప్రారంభం కానుండటంతో ఈ స్కీమ్‌కు త్వరలోనే పరిష్కారం లభిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అమరావతి జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి పాటిబండ్ల నాగ శ్రీనివాస్, వ్యవస్థాపక కార్యదర్శి చావా రవి, ది పయనీర్ చీఫ్ ఆఫ్ బ్యూరో డాక్టర్ రవి కుమార్ బొప్పన, ది హిందూ డిప్యూటీ ఎడిటర్ శ్రీనాథ్, ఆంధ్ర ప్రభ చీఫ్ ఆఫ్ బ్యూరో నేరెళ్లకుంట గోపి పాల్గొన్నారు.



## విన్నకోట వెంకటరత్నం శర్మకు ఘనంగా వీడ్కోలు



**పెడన,ఆగస్టు 31 (వార్తాప్రభ) :** సహకార సంఘం లో గత 34 సంవత్సరాలుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన విన్నకోట వెంకటరత్నం శర్మకు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. దావోజీ పాలెం సొసైటీలో సీఈఓ గా పనిచేస్తున్న ఆయన పదవీ విరమణ చేశారు. సొసైటీ అధ్యక్షుడు కాగిత నాగేశ్వరరావు అధ్యక్షతన వీడ్కోలు సభ జరిగింది. సహకార రంగంలో వెంకటరత్నం చేసిన సేవలను పలువురు ప్రశంశించారు. ప్రజాప్రతినిధులు తో పాటు సకార సంఘాల సీఈఓ లు కూడా శర్మను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శలపాటి ప్రసాద్ కార్యదర్శి శీరం ప్రసాద్ నందిగామ చేవేంద్ర సొసైటీ అధ్యక్షులు యరగని నాగరాజు అంకెం పమిడేశ్వరావు సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు జన్యాల రామాంజనేయులు మండలంలోని వివిధ సంఘాల సీఈఓ లు రైతులు పాల్గొన్నారు

# కోతులవాగు లో ఆగని అక్రమ తవ్వకాలు...?

## మైలవరం మండలం చంద్రగూడెం శివారు కోతులవాగులో అక్రమ మట్టి తవ్వకాలు





- జేసీబీ పెట్టి ట్రాక్టర్లతో యదేచ్ఛగా మట్టి తరలిస్తున్న అక్రమార్కులు
- జేసీబీ,ట్రాక్టర్ల ను పట్టుకొని కూడా వదిలేసిన వీఆర్వో లు
- అధికారుల మౌనం వెనుక మర్మమేంటి ?
- ప్రమాదకరంగా కోతులవాగులో 10 అడుగుల మేర గోతులు
- మట్టి మాఫియాను అడ్డుకోవడంలో శాఖల మధ్య లోపించిన సమన్వయం
- అక్రమ మట్టి తవ్వకాలపై పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన గ్రామ పంచాయితీ సెక్రటరీ
- తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరపాలని
- జిల్లా కలెక్టర్ కి విజ్ఞప్తి చేస్తున్న స్థానిక ప్రజలు

ఎన్టీఆర్ జిల్లా,మైలవరం మండలంలో మట్టి మాఫియా పెట్రేగిపోతోంది.మండల పరిధిలోని పలు గ్రామాలలో అక్రమార్కులు ఇరిగేషన్ చెరువులు, కాలువలు, వాగులు, పంటపొలాల్లో మట్టి మాఫియాకు తెరలేపారు.ఎలాంటి అనుమతులు లేకుండా ఇరిగేషన్ చెరువులు, కాలువలు, వాగుల నుంచి వందల క్యూబిక్ మీటర్ల మట్టిని అమ్ముకొని సొమ్ము చేసుకుంటు న్నారు.పట్టపగలే మట్టిని తరలిస్తుంటే స్థానిక రెవిన్యూ,ఇరిగేషన్ పోలీస్ అలాగే మైనింగ్, విజిలెన్స్ అధికారలు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు గగ్గోలు పెడుతున్నా రు.మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను, ఆ ట్రాక్టర్లకు మట్టి ని లోడ్ చేసే జెసిబి లను సంబంధిత శాఖ అధికారులు పట్టుకొని సీజ్ చేయకుండా ఎలాంటి ఫైన్ విధించకుండా వదిలేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి గండి పడుతుంది. పలుకుబడి ఉన్న రాజకీయ నాయకులు ప్రభుత్వ అనుమతులు లేకుండా మైలవరం మండలంలో గ్రావెల్ మాఫియాకు పాల్పడేవారు కొందరైతే మట్టి మాఫియాకు పాల్పడేవారు మరి కొందరు.ఇలా వీరి అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుందని స్థానిక ప్రజలు పదవి విరుస్తున్నా రు.

వివరాలలోకి వెళితే....

**మైలవరం(చంద్రగూడెం),ఆగష్టు 31 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం,చంద్రగూడెం గ్రామ శివారు మల్లాది కుంట రోడ్డులోని కోతులు వాగులో గత రెండు రోజులుగా అక్రమ మట్టి తవ్వకాలు యదేచ్ఛగా సాగుతున్నాయి. కొంతమంది అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా కోతుల వాగును కొల్లగొడుతున్నారు.



వాగులో 10 మీటర్ లోతు గోతులు తవ్వి మట్టి తరలించడం ద్వారా వాగు ప్రమాదాన్ని తలపిస్తోంది.ఈ విషయం తెలిసి గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకునేందుకు ప్రయత్నిం చారు.అయితే మట్టి అక్రమార్కులు కార్యదర్శి మాటలను ఖాతరు చేయకుండా మట్టి అక్రమ రవాణాను కొనసాగించారు.దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయవాడ ఆర్డీఓ ఆదేశాల మేరకు మైలవరం పోలీస్ స్టేషన్లో ఇంచార్జ్ ఎస్సై శ్రీను ను కలిసి కోతులు వాగులో అక్రమ మట్టి తవ్వకాలపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.అలాగే మరో కాపీ ని డిప్యూటీ తహశీల్దార్ కి కూడా సమాచారం నిమిత్తం అందజేసినట్లు సెక్రటరీ తెలియజేశారు.మరోవైపు ముగ్గురు వీఆర్వో లు వెళ్లి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను,ఆ ట్రాక్టర్లకు మట్టి ని లోడ్ చేసే జెసిబి ని పట్టుకొని కూడా సీజ్ చేయకుండా వదిలేశార ని స్థానికులు చెబుతున్నారు.మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను,ఆ ట్రాక్టర్లకు మట్టి ని లోడ్ చేసే జెసిబి ని సీజ్ చేసి ఫైన్ విధించాలి.కాని అలా జరగలేదనీ, ట్రాక్టర్లను, జెసిబి ని పంపించేయడం వల్ల ప్రభుత్వ అదయానికి గండి పడినట్లైయింద ని స్థానికులు అంటున్నారు.అధికారుల మౌనం వెనుక మర్మమేంటి ? అని ప్రశ్నిస్తున్నారు.ప్రజలు కట్టే పన్నుల నుంచి జీతాలు తీసుకుంటున్న అధికారులు తమ విధులు సక్రమంగా నిర్వర్తించ కుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ రాజకీయ పార్టీ నాయకుల చెప్పుచేతల్లో పని చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధి కారులు స్పందించి చంద్రగూడెం శివారు కోతులవాగు లో జరుగుతున్న మట్టి మాఫియాను అరికట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.దీనిపై కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టాలని మండల ప్రజలు గ్రామ ప్రజలు చేస్తున్నారు.



# సేవ రత్న అవార్డు అందుకున్న బేరి రామచందర్ యాదవ్

- శ్రీ వాగ్దేవి వాద్య సంగీత కళా నృత్య సంస్కృతి సంస్థ నిర్వాహకులు నాగేంద్ర యాదవ్, దివ్య లక్ష్మి ఆధ్వర్యంలో అవార్డు అందుకున్న "భేరి"




**హైదరాబాద్,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** శ్రీ వాగ్దేవి వాద్య సంగీత కళా నృత్య సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో గల శ్రీ త్యాగరాజ గాన సభ ప్రధాన హాలులో "స్వర సప్త సంగీత వాద్య నృత్య సమ్మేళనం" కార్యక్రమం నిర్వహించారు. భారతీయ శాస్త్రీయ సంగీతం, వాద్య సంగీతం, నృత్య కళల అద్భుత వేదికగా బీసీ కులాల ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచందర్ యాదవ్ కు సంగీత కళా నృత్య సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో సేవా రత్న అవార్డును కార్యక్రమ నిర్వాహకులైనా బి. నాగేంద్ర యాదవ్, కార్యక్రమ ఇన్‌ఛార్జ్ బి. దివ్య లక్ష్మిలు అందించారు. ఈ సందర్భంగా నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ బేరి రామచందర్ యాదవ్ గారు వారి అమ్మానాన్నలైన శ్రీ బేరి వెంకటమ్మ వెంకటయ్య మెమోరియల్ ట్రస్టు నామకరణ చేసి ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. సమాజంలో తమ వంతుగా యువత మత్తు మార్గాన వెళ్తున్నారని యువతకు స్పోర్ట్స్ రంగాల్లో అవకాశాలు కల్పిస్తూ విద్యా వైద్యం సామాజికంగా సేవలందిస్తున్న బేరి రామచందర్ యాదవ్ గారికి మా సంస్థ తరుపున సేవా రత్న అవార్డుతో సత్కరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇది మాకు చాలా గర్వకారణం అని అన్నారు. పేద విద్యార్థులకు విద్యా ఉద్యోగాలను విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలు స్టడీ మెటీరియల్స్ మరియు యువత స్పోర్ట్స్ రంగాల్లో రాణించాలని పిల్లలకు స్పోర్ట్స్ కిట్స్ క్రికెట్ కిడ్స్ వాలీబాల్ చెస్ ఆట వస్తువులన్నీ కూడా తమ ట్రస్ట్ ద్వారా సేవలందిస్తూ ఉంటారని గుర్తు చేశారు. అనంతరం సేవరత్న అవార్డు గ్రహీత బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ శ్రీ వాగ్దేవి వాద్య సంగీత కళా నృత్య సాంస్కృతి సంస్థ తనకు అవార్డును అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. సంస్కృతి సంస్థ నిర్వహించిన ఇలాంటి సాంప్రదాయ కార్యక్రమంలో అవార్డు అందించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోచబోయిన సురేష్ యాదవ్, యాదగిరి గుట్ట దేవస్థానం డైరెక్టర్ల బోర్డు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచంద్ర యాదవ్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి వంటాల జంగయ్య, ప్రజాపతి రాజకీయ నాయకుడు సామాజిక కార్యకర్త డాక్టర్ వీర భోగావసంత రాయలు, మునగోడ్ నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే మారమోని శ్రీశైలం యాదవ్, రాజా రావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కాటమరాజు గంగాభవాని దేవస్థానానికి కొత్త దారిని ఏర్పాటు చేయండి

- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి సూచిన మేరకు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసిన దేవాలయ కమిటీ నాయకులు




**మార్కాపురం, ఆగష్టు 31 (వార్తాప్రభ) :** శ్రీ కాటమరాజు గంగాభవాని దేవస్థానానికి వెలుగొండ ప్రాజెక్టు కారణంగా గతంలో వెళ్లే కలనూతల సుంకేసుల గుణం చర్ల దారి మూసివేయబడిందని నూతనంగా లక్షలాదిగా తిరుణాల సందర్భంగా వెళ్లే భక్తుల కోసం మరో కొత్త దారిని ఏర్పాటు చేయించమని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్కాపురం వచ్చిన సందర్భంగా వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఆలయానికి వెళ్లే దారిని ఏర్పాటు చేయడంతో పాటు అతి పురాతనమైనటువంటి శ్రీ కాటంరాజు ఆలయాన్ని ప్రభుత్వమే అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించాలని తద్వారా యాదవుల యొక్క పూర్తిస్థాయి ప్రేమాభిమానాలు పొందగలగాలని , చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తిరుమల తిరుపతి దేవస్థానం యొక్క చైర్మన్ పదవిని పుట్టా సుధాకర్ యాదవ్ కు కేటాయించిన రికార్డు కలిగినటువంటి తమరు యాదవులు ఆరాధ్య దైవమైనటువంటి శ్రీ కాటమరాజు వారి ఆలయం అభివృద్ధికి పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయాలని ఇప్పటికే ఆలయ అభివృద్ధి కోసం గత రెండు సంవత్సరాలుగా సుమారు కోటి రూపాయలు నిధులు సాధించినటువంటి ఎర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గూడూరు ఎడిషన్ బాబు కి అన్ని విషయాలు తెలుసని ఆలయ అభివృద్ధి చేయడం ద్వారా యాదవుల మనసుల్లో చిరస్థాయిగా తెలుగుదేశం పార్టీ నింపవచ్చని వినతి పత్రం అందించిన వారు అభ్యర్థించారు. వినతి పత్రాన్ని అందించిన వారిలో గుండంచర్ల మాజీ సర్పంచ్ గంగుల ఎల్లయ్య యాదవ్, ఒంటేరు రాఘవ యాదవ్, మార్కాపురం జిల్లా కేంద్రంలో ప్రాక్టీస్ చేస్తున్నటువంటి న్యాయవాది పిన్నిక నాగార్జున ప్రసాద్ యాదవ్, ధనంకుల హరిబాబు యాదవ్ నాలి కొండయ్య యాదవ్ చక్రపాణి యాదవ్ బోరి గొర్ల గాలయ్య యాదవ్,కాయకాకుల శ్రీనివాస్ యాదవ్ పాముల పోల్ రాజు పెద్దిరాజు యాదవ్ పాముల పోలరాజు ఆర్మీ యాదవ్ తదితరులు ఉన్నారు. అంతకుముందు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి నీ నాయకులు కలవగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తే తగు న్యాయం జరుగుతుందని ఆయన ఇచ్చిన సూచన మేరకు ముఖ్యమంత్రినీ కలిసినట్లు రాష్ట్ర బీసీ నాయకుడు పి ఎల్ పి యాదవ్ "వార్తా ప్రభ"కు తెలిపారు.

# పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

-దివ్యాంగులు, నిర్భాగ్యులకు విందు భోజనం



**హనుమాన్ జంక్షన్, ఆగష్టు 31 (వార్తాప్రభ) :** జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 2న హనుమాన్ జంక్షన్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ నాయకులు, సాయినాథ్ హోటల్ అధినేత అల్లాడశెట్టి నాగేశ్వరరావు తెలిపారు. హనుమాన్ జంక్షన్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న సాయినాథ్ హోటల్ వద్ద జన్మదిన వేడుకలు నిర్వహించిన అనంతరం ఏలూరు రోడ్డులోని ఆశాజ్యోతి హ్యాండిక్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీలోని 80 మంది దివ్యాంగ బాలబాలికలకు, గుడివాడ రోడ్డులోని ప్రజ్వల హోమ్‌లో ఉన్న 60 మంది నిర్భాగ్యులకు విందు భోజనం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, కూటమి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని అల్లాడశెట్టి నాగేశ్వరరావు కోరారు.

# నూజివీడు ఏరియా ఆసుపత్రికి ఎలక్ట్రికల్ బెడ్, వీల్‌చైర్ వితరణ..



**నూజివీడు,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టడమే కాకుండా, వ్యక్తిగతంగా కూడా తనవంతు సహకారం అందించడంలో ముందుంటానని రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ కొలుసు పార్థసారథి ఇచ్చిన హామీ మేరకు నూజివీడు ఏరియా ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం ఎలక్ట్రికల్ బెడ్, ఎలక్ట్రికల్ వీల్‌చైర్‌ను వితరణగా అందించారు. మంత్రి శ్రీ కొలుసు పార్థసారథి తండ్రి, మచిలీపట్నం మాజీ పార్లమెంట్ సభ్యులు స్వర్గీయ శ్రీ కొలుసు పెద్ద రెడ్డయ్య గారి పేరుతో ఏర్పాటు చేసిన కొలుసు పెద్ద రెడ్డయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు రూ.1 లక్ష రూపాయలు విలువైన ఎలక్ట్రికల్ బెడ్, ఎలక్ట్రికల్ వీల్‌చైర్‌ను ఆసుపత్రికి వితరణగా అందించగా, నూజివీడు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీ/శ్రీమతి పద్మజ గారు లాంఛనంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

# ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం...




**నూజివీడు,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** ఏలూరుజిల్లా నూజివీడు మండలము జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల అన్నవరములో సీనియర్ తెలుగుటీచర్ శ్రీ మంగలక్ష్మి, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయిని వెంకటరమణ,ఫిజికల్ డైరక్టర్ రవీంద్ర ను తెలుగుబాషా దినోత్సవము మరియు క్రీడా దినోత్సవము సంధర్భముగా సన్మానించడం జరిగినది అని పాఠశాల ప్రధానోపాధ్యాని విజయకుమారి తెలిపారు. ప్రధానోపాధ్యాయని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తెలుగుబాషపై పట్టు సాధించాలని కోరారు.తెలుగు భాష అమ్మలాంటిదని తెలిపారు. తెలుగులో ఉచ్చారణ దోషము లేకుండా మాట్లాడాలని కోరారు. చదువుతో పాటు క్రీడలు అవసరమని తెలిపారు. సీనియర్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు మాట్లాడుతూ తెలుగు భాష పై పట్టుసాధిస్తే అన్ని భాషలు సులభముగా నేర్చుకోవచ్చని తెలిపారు. దేశభాష లందు తెలుగులెస్స అని తెలిపారు. ఆటలు శారీరక,మానసిక వికాసానికి ఉపయోగ పడతాయని తెలియచేశారు. ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు నాగేంద్రరావు, నాగరాజు, దుర్గామల్లేశ్వరరావు, జయకుమారి, యం వి.రమణ, కృష్ణకుమారి వ్యాయామ ఉపాధ్యాయుడు రవీంద్ర పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పై అవగాహన కార్యక్రమం...



**పెనుగంచిప్రోలు,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మునేటి ఒడ్డున మూడు రోడ్ల కుడాలి లో ఉన్న శృతి పంక్షన్ హాల్ వద్ద సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాని పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ ఎస్ ఐ అర్జున్ ఆధ్వర్యంలోసోమవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ – 2 నాగేశ్వర రావు, మరియు పోలీస్ సిబ్బంది, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు..

# జాతీయ స్థాయి హైజంప్ పోటీలకు ఎంపికైన చంద్రకళకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ అభినందనలు

జాతీయ స్థాయిలోనూ రాణించి రామచంద్రపురానికి పేరు తీసుకురావాలని ఆకాంక్ష



**రామచంద్రపురం,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** ఈ నెల 15, 16, 17, 18 తేదీల్లో పాండిచ్చేరిలో జరగనున్న జాతీయస్థాయి హైజంప్ పోటీలకు ఎంపికైన రామచంద్రపురం డిగ్రీ కళాశాల విద్యార్థిని పి. చంద్రకళను, ఆమె కోచ్ అరుణ్ కుమార్, డిగ్రీ కళాశాల పీడీ నూకరాజును సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం అభినందించారు. ఇటీవల ఆగస్టు 11, 12, 13 తేదీల్లో తిరుపతిలో జరిగిన హైజంప్ పోటీల్లో చంద్రకళ ప్రథమ స్థానంలో నిలిచి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల వాసంశెట్టి సత్యం ప్రత్యేకంగా అభినందించారు. పాండిచ్చేరిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థిని చంద్రకళ, ఆమె కోచ్‌కు అవసరమైన ప్రయాణ టికెట్లను సమకూరుస్తామని వాసంశెట్టి సత్యం హామీ ఇచ్చారు. జాతీయస్థాయిలోనూ అద్భుత ప్రతిభ కనబరిచి విజయం సాధించి రామచంద్రపురం ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ప్రతిభ కనబరు స్తున్న విద్యార్థులను ప్రోత్సహించడంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఎప్పుడూ ముందు ఉంటుందన్నారు. ఇప్పటికే చంద్రకళకు అవసరమైన షూస్, స్పోర్ట్స్ కిట్లను కూడా అందించినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపుతున్న యువతకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చంద్రకళ జాతీయస్థాయిలోనూ విజయం సాధించి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వాసంశెట్టి సత్యం ఆకాంక్షించారు.

# విద్యుత్ సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోండి

జిల్లా విద్యుత్ శాఖ సమీక్షలో ఎంపీ హరీష్ బాల యోగి



**అమలాపురం,ఆగష్టు 31 (వార్తాప్రభ) :** డాక్టర్ బి ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి ఆ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లో జరిగిన విద్యుత్ శాఖ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్,ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు లతో కలిసి పాల్గొన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన 1912 పిర్యాదులను గ్రామాల వారీగా విశ్లేషించి త్వరిగతిన పరిష్కార మార్గాలు చూపాలన్నారు. 327 కోట్ల వ్యయంతో చేపట్టిన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల వేగం పెంచాలన్నారు. విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపీ హరీష్ పేర్కొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188